ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5 తమిళనాడు TAMILNADU
గురువారం 5 జూన్ 2025



కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా

8న మదురైకి అమిత్ షా

- దక్షిణ జిల్లాల నేతలతో మీటింగ్
- ఓపీఎస్‌తో భేటీ అయ్యే అవకాశం

పెరంబూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఈ నెల 8వ తేది మదురై రానున్నట్లు తెలిసింది. దక్షిణ జిల్లాలకు చెందిన పార్టీ ముఖ్యనేతలతో ఆయన సమావేశం కానున్నారు. అదే సమయంలో ఓపీఎస్, టీటీవీ దినకరన్‌లను కూడా కలుసుకునే అవకాశమున్నట్లు తెలుస్తోంది. గత నెలలో అమిత్ షా చెన్నై వచ్చిన సమయంలో, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నయినార్ నాగేంద్రన్‌ను ఎంపికయ్యారు. అలాగే, అన్నాడీఎంకే-బీజేపీ కూటమి ప్రకటించారు. ఆ సమయంలో బీజేపీ కూటమిలో ఉన్న ఏఎంకే ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్, మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వంను అమిత్ షా కలుసుకోలేదు. కానీ, అన్నాడీఎంకే తరఫున ఓపీఎస్, టీటీవీ దినకరన్‌లను కూటమిలో చేర్చుకునేందుకు ఎడప్పాడి ఇష్టపడడం లేదు.

దక్షిణ జిల్లాలపై గురి...

రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు ఇంకా 10 నెలలు మాత్రమే గడువున్న నేపథ్యంలో, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈ నెల 8న మదురై రానున్నారు. మదురై ఒత్తకడై ప్రాంతాలో జరిగే పార్టీ బహిరంగసభలో ఆయన పాల్గొననున్నారు. అలాగే దక్షిణ జిల్లాలకు చెందిన బీజేపి ముఖ్యనేతలతో కూడా అమిత్ షా సమావేశం కానున్నారు. ఇటీవలే డీఎంకే సర్వసభ్య సమావేశం మదురైలో బ్రహ్మాండంగా నిర్వహించారు. అదే కోణంలో బీజేపీ కూడా మదురైలో భారీ బహిరంగ సభ నిర్వహణకు సమాయాత్తమైంది. గత పార్లమెంటు ఎన్నికల్లో దక్షిణ జిల్లాల్లో బీజేపీ మంచి ఓటు బ్యాంక్ సాధించింది. పర్యటనలో భాగంగా దక్షిణ జిల్లాలో పార్టీ పోటీచేసే స్థానాలను కూడా అమిత్ షా నేతలతో చర్చించనున్నారు.



సచివాలయం నుండి రోబో పరికరాల తయారీ కర్మాగారాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

పరిశ్రమలతో ఉపాధి

- సీఎం స్టాలిన్
- ఇరుంగాట్టుకోటలో రూ. 300 కోట్లతో రోబో పరికరాల తయారీ కర్మాగారం
- రాణిపేటలో రూ.175 కోట్లతో ఎయిర్ సెపరేషన్ ప్లాంట్
- ప్రారంభించిన ముఖ్యమంత్రి

చెన్నై, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లా ఇరుంగాట్టుకోట సిప్కాట్ పారిశ్రామిక వాడలో అజైల్ రోబోట్స్ సంస్థ రూ.300 కోట్లతో నెలకొల్పిన రోబో విడిపరికరాల కర్మాగారాన్ని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ బుధవారం ఉదయం ప్రారంభించారు. జర్మనీకి చెందిన అజైల్ రోబోట్స్ ఎస్ఈ సంస్థ కృత్రిమ మేధోపరిజ్ఞానం (ఏఐ), రోబోటిక్స్ సాంకేతిక పరిజ్ఞానాన్ని మేళవించి భావితరాలకు పరిష్కారాన్ని అందించడంలో అంతర్జాతీయ ఖ్యాతి గడించింది. ఆ సంస్థ అన్ని రంగాలకు ఉపయోగపడేలా ఏఐ రోబోటిక్ యంత్ర భాగాలను ఉత్పత్తి చేసే కర్మాగారాన్ని ఇరుంగాట్టుకోట పారిశ్రామికవాడలో నెలకొల్పింది. చెన్నై సచివాలయంలో పరిశ్రమలు, పారిశ్రామికపెట్టుబడుల ప్రోత్సాహక, వాణిజ్య శాఖల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆ కర్మాగారాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్టాలిన్ ప్రారంభించారు. ఈ కర్మాగారం ద్వారా 300 మంది స్థానిక ఇంజనీరింగ్ పట్టభద్రులు, సాంకేతిక నిపుణులకు ఉపాధి అవకాశాలు కల్పించినట్లు సీఎం పేర్కొన్నారు.

రాణిపేటలో మరో కర్మాగారం..

రాణిపేట సిప్కాట్ ఎస్ఓఎల్ ఇండియా సంస్థ నెలకొల్పిన ఎయిర్ సెపరేషన్ ప్లాంట్ కూడా ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. ఇటలీకి చెందిన ఎస్ఓఎల్ ఎస్పీఏ సంస్థ, ఇండియాకు చెందిన సిక్ జిలసాల్ ఇండియా సంస్థల భాగస్వామ్యంగా ఉన్న ఎస్ఓఎల్ ఇండియా సంస్థ రాణిపేట సిప్కాట్‌లో పరిశ్రమలు, ఆస్పత్రులకు సంబంధించిన ఆక్సిజన్ ఉత్పత్తిచేస్తోంది. 2019లో విదేశీ పెట్టుబడుల సమీకరణ సమయంలో ఈ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుని రూ.175 కోట్లతో ఎయిర్ సెపరేషన్ ప్లాంట్ నెలకొల్పేందుకు సన్నాహాలు చేపట్టింది. 2023 జూలై 19న ఈ ప్లాంట్‌కు సీఎం స్టాలిన్ శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ఆ ప్లాంట్ నిర్మాణం పూర్తి కావటంతో సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దానిని ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో మంత్రి టీఆర్‌బీ రాజా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్. మురుగానందం, పరిశ్రమలు, పారిశ్రామికపెట్టుబడుల ప్రోత్సాహక, వాణిజ్య శాఖల కార్యదర్శి వి. అరుణ్‌రాయ్, రాష్ట్ర పారిశ్రామిక మార్గదర్శక సంస్థ సీఈఓ పి. అలర్‌మేల్‌మంగై, అజైల్ రోబోట్స్ సంస్థ వైస్ చైర్మన్ రోరీ సాక్స్టన్, ఆ సంస్థ భారతీయ కార్యకలాపాల విభాగం మేనేజింగ్ డైరెక్టర్ శరవణన్ సోలయప్పన్, ఎస్ఓఎల్ ఇండియా సంస్థ అధ్యక్షులు అల్డో ఫ్యూమక్లీ రొమారియో, ప్రాజెక్ట్ చైర్మన్ కైలియో లావ్ ఫ్యూమక్లీ రొమారియో, ఎస్ఓఎల్ ఇండియా సంస్థ డైరెక్టర్ ఎస్‌వి వెంకటేశన్ తదితరులు పాల్గొన్నారు.



నేడే 'నిర్ణయం'

అన్బుమణి వ్యవహారంపై సీనియర్లతో రాందాస్ మంతనాలు

చెన్నై, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): 'పాట్టాలి మక్కల్ కట్చి' (పీఎంకే) వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్, పార్టీ అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి మధ్య కొనసాగుతున్న ప్రచ్ఛన్నయుద్ధం తారస్థాయికి చేరింది. అన్బుమణి వ్యవహారంపై రాందాస్ గురువారం 'తగిన నిర్ణయం' తీసుకునేందుకు సిద్ధమయ్యారు. తన మాట జవదాటిని కుమారుడిపై చర్యలకు ఆయన నడుంబిగించారని పీఎంకే సీనియర్లు చెబుతున్నారు. మరో వైపు అన్బుమణి వందమందికిపైగా జిల్లా కార్యదర్శులు, ఇన్‌ఛార్జులను వెంటబెట్టుకుని పార్టీ సభ్యత్వ కార్యక్రమాలు, సమావేశాలు పేరుతో పార్టీ పగ్గాలు తన చేతుల్లోనే ఉన్నాయని పరోక్షంగా రాందాస్‌కు సంకేతాలు పంపుతున్నారు. అదే సమయంలో అన్బుమణికి మద్దతు ఇస్తున్న జిల్లా కార్యదర్శులను రాందాస్ తొలగించి కొత్తవారిని నియమిస్తున్నారు. కొన్నేళ్లుగా భర్తీకాని జిల్లా కార్యదర్శుల పదవుల పోస్టులకు తన మద్దతు దారులను నియమిస్తు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఆ ప్రకారం తిరువళ్లూర్ నార్త్ జిల్లా శాఖ కార్యదర్శిగా ఎస్డీకే శేఖర్, తిరువళ్లూరు ఈస్ట్ జిల్లా శాఖ కార్యదర్శిగా భగవాన్ పళని, తిరువళ్లూరు సౌత్ జిల్లా శాఖ కార్యదర్శిగా పళనిస్వామి, సౌత్ చెన్నై తూర్పు జిల్లా శాఖ కార్యదర్శిగా మయిలై ఆరుముగం,వేలూరు ఈస్ట్ జిల్లా కార్యదర్శిగా వీఎస్ వెంకటేష్, మదురై సబర్బన్ జిల్లా శాఖ కార్యదర్శిగా మురుగన్, మదురై సబర్బన్ జిల్లా శాఖ కార్యదర్శి పాండి కామాక్షి అలియాస్ భారతి పాండ్యన్, రామనాథపురం ఈస్ట్ నియోజకవర్గం జిల్లా కార్యదర్శిగా సంతానదాస్, తెన్‌కాశి ఈస్ట్ జిల్లా శాఖ కార్యదర్శిగా సింగరాయన్,తెన్‌కాశి సౌత్ జిల్లా శాఖ కార్యదర్శిగా సింగరాయన్‌ని నియమించారు. తైలాపురం గార్డెన్ ప్రాంతంలో వారం రోజులుగా పార్టీలో నెలకొన్న సంక్షోభాన్ని పరిష్కరించేందుకు మద్దతుదారులతో రాందాస్ చర్చలు జరుపుతున్నారు. ఈ చర్చల్లో పీఎంకే గౌరవాధ్యక్షుడు, శాసనసభ్యుడు జీకే మణి, వన్నియర్ సంఘం అధ్యక్షుడు అరుళ్‌మొళి కూడా పాల్గొన్నారు.వీరితో రాందాస్ మాట్లాడుతూ అన్బుమణిని తొలగించాల్సిన అవసరం ఏర్పడిందని వాపోయినట్లు తెలిసింది. దాంతో పార్టీలో తీవ్ర పరిణామాలు తప్పవని సీనియర్లు ఆందోళన చెందుతున్నారు.


6న రాజ్యసభ అభ్యర్థుల నామినేషన్

చెన్నై, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి ఖాళీ అవుతున్న ఆరు రాజ్యసభ స్థానాలకు పోటీ చేయనున్న డీఎంకే అభ్యర్థులు ముగ్గురు, అన్నాడీఎంకే అభ్యర్థులు ఇద్దరు, ఎంఎన్‌ఎం నుంచి కమల్‌హాసన్ ఈ నెల 6న నామినేషన్లు దాఖలు చేయనున్నారు. శాసనసభలో డీఎంకే కూటమికి, అన్నాడీఎంకే కూటమికి ఉన్న శాసనసభ్యుల సంఖ్య బట్టి డీఎంకే నలుగురిని, అన్నాడీఎంకే ఇద్దరిని అభ్యర్థులుగా ఎంపిక చేసింది. ఆ మేరకు డీఎంకే తరఫున పి.విల్సన్, కవయిత్రి సల్మా, శివలింగం, ఎంఎన్‌ఎం నేత కమల్‌హాసన్, అన్నాడీఎంకే నుంచి ఇన్బదురై, ధనపాల్ అభ్యర్థిగా ఎంపికైన విషయం విదితమే. వారు ఈ నెల 6న నామినేషన్లు దాఖలు చేయనుండటంతో సచివాలయంలో ఎన్నికల సంఘం అధికారులు ఏర్పాట్లు చేపడుతున్నారు.

అవసరమైతే పాఠశాలల్లో మాస్కులు

- మంత్రి అన్బిల్ మహేష్

పెరంబూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రాష్ట్రంలో కొవిడ్ వ్యాప్తి అదుపులో ఉందని, అవసరమైతే పాఠశాలల్లో విద్యార్థులు మాస్క్ ధరించాలని సూచిస్తామని పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ తెలిపారు. తిరుచ్చిలో బుధవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్ర ఆరోగ్యశాఖ ప్రకటన మేరకు, ప్రస్తుతం వ్యాప్తిస్తున్న కొవిడ్ వైరస్ ప్రాణాంతకం కాదని తెలుస్తుందన్నారు. అదే సమయంలో, ముందు జాగ్రత్త చర్యలుగా అన్ని జిల్లాల్లో కొవిడ్ వార్డులు ఏర్పాటుచేస్తుమన్నారు. పాఠశాలల్లో కూడా ముందస్తు చర్యలు చేపట్టినట్లు, తప్పనిసరి పరిస్థితుల్లో పాఠశాలల్లో విద్యార్థులు మాస్క్ ధరించాలని చెబుతామని మంత్రి తెలిపారు.



డ్రైవర్లను హెచ్చరించే పరికరం

- ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసేలా ఏర్పాటు

చెన్నై, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): బస్సు డ్రైవర్లు, బస్సులో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడకుండా ఉండేలా రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ చర్యలు చేపడుతోంది. దూరప్రాంతాల బస్సుల్లో డ్రైవర్లు నిద్రమత్తులో జోగాడితే ఎప్పటికప్పుడు హెచ్చరించేలా కృత్రిమ మేధో పరికరం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల డ్రైవర్లు కొందరు పనిభారం, ఇతర ఒత్తిళ్ల కారణంగా నిద్రమత్తుకు గురవుతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే, కొందరు డ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించిన సమయంలోనూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ప్రమాదాలను అరికట్టేలా కృత్రిమ మేధో పరికరం ఏర్పాటుచేయాలని రవాణాశాఖ నిర్ణయించింది. అందుకోసం రూ.2 కోట్లతో కొనుగోలు చేసిన పరికరాలను 500 బస్సుల్లో అమర్చనున్నారు. డ్రైవర్ నిద్రమత్తులో ఉన్నా, ఆవులించినా, నిర్లక్ష్యంగా బస్సు నడిపినా ఈ పరికరం గుర్తించి హెచ్చరికలు జారీ చేస్తుంది. డ్రైవర్ ముందు కెమెరాతో కూడిన ఈ పరికరం, డ్రైవర్ ముఖకవళికలను ఎల్లప్పుడూ పర్యవేక్షిస్తూ ఉంటుంది. అతడు నిద్రపోయినా, ఆవులించినా, అతని కనురెప్పలు మూతపడినా ఈ పరికరంతో అనుసంధానమైవున్న సెన్సార్ పరికరం సైరన్ మోగిస్తుంది. అలాగే, బస్సు నాలుగు వైపులా కెమెరాలు అమర్చనున్నారు. ఒకవేళ బస్సు ప్రమాదానికి గురైతే, ప్రమాదానికి గల కారణాలను పోలీసులు సత్వరం తెలుసుకునేలా ఈ కెమెరాలు పనిచేస్తాయని రవాణా శాఖ అధికారులు తెలిపారు.

టెన్త్, ప్లస్-2లో ఉత్తీర్ణులైన విద్యార్థులపై

టీవీకే కానుకల వర్షం

- రూ.5వేల చెక్కులు పంపిణీ చేసిన విజయ్

చెన్నై, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): 'తమిళగ వెట్రికళగం' (టీవీకే) అధ్యక్షుడు, ప్రముఖ సినీ నటుడు విజయ్ విద్యార్థుల్లో ఆసక్తిని, ప్రోత్సాహాన్ని పెంచేలా గత రెండేళ్లుగా నియోజకవర్గాలవారీగా పదోతరగతి, ప్లస్-2 పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులకు నగదు కానుకలు అందిస్తున్నారు. ఈ యేడాది కూడా రాష్ట్ర వ్యాప్తంగా టెన్త్ ప్లస్-2 పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మూడు విడతలుగా నగదు కానుకలు, అవార్డులు అందించాలని నిర్ణయించారు. తొలివిడతగా 16 జిల్లాల పరిధిలో ఉన్న 88 నియోజకవర్గాలకు చెందిన సుమారు 600 మంది విద్యార్థులకు మే 30న అవార్డులు, నగదు కానుకలు అందించారు. ఈ నేపథ్యంలో రెండో విడతగా బుధవారం ఉదయం మహాబలిపురం సమీపంలోని ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో టెన్త్, ప్లస్-2 పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు నగదు బహుమతులు, అవార్డులు అందజేశారు. రామనాథపురం, ఈరోడ్, కరూరు, తంజావూరు, ధర్మపురి, తిరుచ్చి, తిరునల్వేలి, తిరుపత్తూరు, తిరుప్పూరు, తిరువారూరు, తెన్‌కాశి, మైలాడుదురై, విరుదునగర్, విల్లుపురం జిల్లాల పరిధిలోని 75 నియోజవర్గాలకు చెందిన విద్యార్థులు, పుదుచ్చేరిలోని 9 నియోజకవర్గాలకు చెందిన విద్యార్థులు మొత్తం 500 మందికి నగదు కానుకలందించారు. తొలుత పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ స్వాగతోపన్యాసం చేశారు. తిరుప్పూరు జిల్లా పల్లడం నియోజకవర్గం పరిధిలో ప్లస్-2లో 599 మార్కులు సాధించిన సి.రాహుల్ అనే విద్యార్థికి బంగారు ఉంగరం, అదే జిల్లా మడత్తుకుళం నియోజకవర్గం పరిధిలో టెన్త్ ఫలితాల్లో 500 మార్కులకు 499 మార్కులు సంపాదించిన కేకే దివ్యలక్ష్మికి విజయ్ బంగారు చెవిదుద్దులు కానుకగా అందజేశారు. నియోజకవర్గాలవారీగా తొలి మూడు ర్యాంకుల పొందిన విద్యార్థులందరికీ తలా రూ.5వేల చెక్కులను పంపిణీ చేశారు.



దివ్యాంగురాలైన విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న టీవీకే నేత విజయ్

కొవిడ్‌పై భయాందోళనలు వద్దు

- మంత్రి ఎం.సుబ్రమణ్యం

అడయార్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కొవిడ్ వ్యాప్తిపై భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. తేనాంపేటలో ఆరోగ్య శాఖ, వ్యాధుల నియంత్రణ వైద్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సుబ్రమణ్యం మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో ఆరోగ్య శాఖ సేవల ద్వారా లక్షలాది మంది లబ్ది పొందుతున్నారన్నారు. శ్వాసకోశ సంబంధిత సమస్యలతో పలువురు మృత్యువాతపడుతున్నారని, దానిపై అవగాహన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు.తాజాగా వ్యాపిస్తున్న కొవిడ్ ప్రాణాంతకమైనది కాదన్నారు. అనారోగ్య సమస్యలున్న వారు, గర్భిణులు బహిరంగ ప్రాంతాలకు రావడం తగ్గించాలని మంత్రి సుబ్రమణ్యం విజ్ఞప్తి చేశారు.

ఎన్నికలకు సిద్ధం కండి

- ఎమ్మెల్యేలకు ఈపీఎస్ దిశా నిర్దేశం

ప్యారీస్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీకి వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికల్లో పార్టీని మెజార్టీ సీట్లలో గెలిపించి అధికారంలో కూర్చోబెట్టాలన్న లక్ష్యంతో ఎన్నికలకు సిద్ధంకావాలని అన్నాడీఎంకే ఎమ్మెల్యేలకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) పిలుపునిచ్చారు. 2026లోశాసనసభ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో రాయపేటలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాలిగైలో బుధవారం ఉదయం ఈపీఎస్ ఆ పార్టీ ఎమ్మెల్యేలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయా నియోజకవర్గాల్లోని సమస్యలు, వాటి పరిష్కారం కోసం చేసిన ప్రయత్నాలు, అన్నాడీఎంకే పట్ల ప్రజల్లో ఉన్న అభిప్రాయాలు, పార్టీ ఓటుబ్యాంకు, ఎన్నికల ప్రచారంలో ఏఏ అంశాలు ఉండాలి, బూత్ కమిటీల ఏర్పాటు తదితరాల వివరాలను ఈపీఎస్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈపీఎస్ మాట్లాడుతూ, జెండా మోస్తున్న కార్యకర్తలే పార్టీకి బలమని, వారిని పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, జిల్లా కార్యదర్శుల పదవుల్లో ఉన్నవారు ప్రతిరోజు పలకరించి పార్టీ పనులు చేయించుకోవాలని సలహా ఇచ్చారు. 2016 అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే సాధించిన విజయం అసామాన్యమని, వచ్చే ఏడాదిలోనూ మహా విజయం కోసం ప్రతీ కార్యకర్త సైనికుడిలా ఇప్పటినుండే పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ ప్రిసీడియం చైర్మెన్ తమిళ్ మగన్ హుస్సేన్, ప్రధాన నిర్వాహకులు కేపీ మునుస్వామి, దిండుగల్ శ్రీనివాసన్, పొల్లాచ్చి జయరామన్, ఎస్పీ వేలుమణి, డి.జయకుమార్, కేఏ సెంగోట్టయ్యాన్, డాక్టర్ విజయ్‌భాస్కర్, కడంబూరు రాజు, తంగమణి, సి.పొన్నయ్యాన్, వలర్మతి, గోకుల ఇందిరా, అసెంబ్లీ మాజీ స్పీకర్ ధనపాల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో కేపీ మునుస్వామి, ఎడప్పాడి పళనిస్వామి, దిండుగల్ శ్రీనివాసన్

రాజ్యసభకు పోటీ చేస్తున్న అభ్యర్థులకు మద్దతుగా సంతకాలు...

రాజ్యసభ ఎన్నికల్లో అన్నాడీఎంకే తరుపున పోటీ చేయనున్న ఐఎస్ ఇన్బదురై, ధనపాల్‌లను ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలకు ఈపీఎస్ పరిచయం చేశారు. రాష్ట్ర అసెంబ్లీలో రెండాకుల గుర్తుపై పోటీ చేసి గెలిచిన 66 మంది సభ్యులుండగా, వీరిలో నలుగురు ఓపీఎస్ వర్గానికి చెందినవారు కావడం గమనార్హం. వీరిని మినహాయించి మిగతా 62 మంది సభ్యులు రాజ్యసభ ఎన్నికల్లో అన్నాడీఎంకే తరుపున పోటీచేయనున్న ఇన్బదురై, ధనపాల్‌లకు మద్దతు తెలుపుతూ నామినేషన్ పత్రాల్లో సంతకాలు చేశారు.

ఆర్కాడు వీరాసామితో డీఎంకే అభ్యర్థుల భేటీ

టి.నగర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభకు డీఎంకే తరఫున పోటీ చేస్తున్న ముగ్గురు అభ్యర్థులు ఆ పార్టీ ఉన్నత కార్యాచరణ మండలి సభ్యుడు, మాజీ మంత్రి ఆర్కాడు వీరాసామిని కలుసుకున్నారు. న్యాయవాది పి.విల్సన్, కవయిత్రి సల్మా, ఎస్ఆర్ శివలింగం బుధవారం సాయంత్రం అన్నానగర్ నివాసంలో వృద్ధాప్యం కారణంగా విశ్రాంతి తీసుకుంటున్న ఆర్కాడు వీరాసామిని కలుసుకుని ఆయన ఆశీస్సులందుకున్నారు. ఈ సందర్భంగా వీరాసామి తనయుడు, డీఎంకే ఎంపీ డాక్టర్ కళానిధి వీరాసామిని కూడా ముగ్గురు అభ్యర్థులు ప్రత్యేకంగా కలుసుకున్నారు.



డీఎంకే మాజీ మంత్రి ఆర్కాడు వీరాసామిని మర్యాదపూర్వకంగా కలుసుకున్న డీఎంకే అభ్యర్థులు

సమాచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

చిట్లపాక్కం: టీఎస్‌హెచ్‌బీ కాలనీ, మాంబాక్కం మెయిన్ రోడ్డు, మహేశ్వరి నగర్, ప్రియదర్శిని నగర్, ఒట్టియంబాక్కం మెయిన్ రోడ్డు, వళ్లువర్ నగర్, జయ నగర్, వివేకానంద నగర్

మాదంబాక్కం: ఇందిరా నగర్ శాంతినికేతన్ కాలని, తంబయ్యరెడ్డి కాలని, పార్వతి నగర్ నార్త్, కామాక్షి నగర్, బాలాజి నగర్, కర్పగం నగర్, ఏపీఎన్ నగర్, ఎంజీఆర్ నగర్, శారద గార్డన్, శ్రీనివాస నగర్, రమణ నగర్, మారుతి నగర్, అన్నానగర్ మాదంబాక్కం. **కొవ్వూర్:** తండలం,ఆకాష్ నగర్, గెరుగంబాక్కం, మనిమేడు, తారపాక్కం, సీపీ గార్డన్, భారతియార్ వీధి, అంబాళ్ నగర్, రోజ్ గార్డన్, వణిగర్ వీధి

అంబత్తూర్: మిల్లీనియం టవర్స్ ఫేస్ -1,2,3, పార్క్ రోడ్డు, యూఆర్ నగర్, బాలాజి నగర్, కుప్పుస్వామి వీధి, జెమి కాంపౌండ్, కలెక్టర్ నగర్, ఎంఎంఎం హాస్పిటల్, ఎస్ఎం నారాయణ నగర్, రామ నగర్, కలైవానర్ కాలని, 11 కేవీ పంపింగ్ స్టేషన్, హెచ్‌టీ సర్వీస్, నార్త్ అవెన్యూ రోడ్డు, కొరట్టూర్ రైల్వేస్టేషన్ బుకింగ్ ఆఫీస్, కొరట్టూర్ బస్టాండ్ 61 నుంచి 72 వీధులు, దురైస్వామి 1,2 వీధులు, ధనపాల్‌చెట్టి 1,2 వీధులు, రైల్వేస్టేషన్ రోడ్డు, వీఓసీ 1,2 వీధులు, లక్ష్మి ముదలాలి 1 నుంచి 3 వీధులు.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక అడయార్ మండల పరిధిలో గురువారం విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. వేళచ్చేరి మెయిన్ రోడ్డులోని సబ్ స్టేషన్ ప్రాంగణంలోని అడయార్ నిర్వహణ ఇంజనీర్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు జరుగనున్న గ్రీవెన్స్‌లో అడయార్, చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు పాల్గొని తమ సమస్యలు తెలిపి పరిష్కారం పొందవచ్చని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

పింఛనర్లకు ఫెస్టివల్ అడ్వాన్స్ పెంపు

చెన్నై, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పింఛనర్లకు ఫెస్టివల్ అడ్వాన్స్ రూ.4,000 నుంచి రూ.6,000 పెరిగింది. ముఖ్యమంత్రి స్టాలిన్ ఏప్రిల్ 28వ తేది శాసనసభ సమావేశాల్లో 110వ నిబంధన కింద సివిల్, ఉపాధ్యాయ పింఛనర్ల కుటుంబాలకు అందించే ఫెస్టివల్ అడ్వాన్స్ రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంచనున్నట్లు, ఈ పెంపుతో సుమారు 52 వేల మంది పింఛన్‌దారులు లబ్ధిపొందుతారని, ఇందుకోసం ప్రభుత్వానికి రూ.10 కోట్లు అదనపు ఖర్చు పడుతుందని తెలియజేశారు. ఈ పెంపుకు సంబంధించిన జీవోను రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది.

ప్లస్ టూ జవాబు పత్రాల నకళ్లు విడుదల

పెరంబూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్లస్ టూ జవాబు పత్రాల నకళ్లు బుధవారం విడుదలయ్యాయి. విద్యార్థులు www.dge.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో జవాబు పత్రాల నకళ్లు పొందవచ్చు. రీ టోటలింగ్, రీ వాల్యుయేషన్ కోసం విద్యార్థులు, దరఖాస్తుతో పాటు ఆయ పాఠ్యాంశం జవాబు పత్రాల నకళ్లు జతచేసి ఈ నెల 5,6,7 తేదీల్లో జిల్లా పరీక్ష జాయింట్ డైరెక్టర్ కార్యాలయాల్లో సమర్పించాలి. దరఖాస్తు రుసుముగా రీ వాల్యుయేషన్‌కు ఒక పాఠ్యాంశానికి రూ.505, రీ టోటలింగ్‌కు సైన్స్ సబ్జెక్టులకు రూ.305, ఇతర పాఠ్యాంశాలకు రూ.205 చెల్లించాల్సి ఉంటుందని ప్రభుత్వ పరీక్షల శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

ఎస్ఈటీసీలో పెరిగిన ఆన్‌లైన్ రిజర్వేషన్

పెరంబూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ)లో ఆన్‌లైన్ రిజర్వేషన్ చేసుకొనే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ ఏడాది మేలో అధికంగా 7,74,493 మంది ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకున్నారు. అంతకు ముందు జనవరిలో 6.64 లక్షల మంది రిజర్వేషన్ చేసుకున్నారు. సౌకర్యవంతమైన ప్రయాణానికి ముందుగానే www.tnstc.in అనే వెబ్‌సైట్, TNSTC అనే మొబైల్ యాప్‌లో రిజర్వేషన్ చేసుకోవాలని ఎస్ఈటీసీ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

తిరుచెందూర్ హుండీ ఆదాయం రూ.3.42 కోట్లు

పెరంబూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి వారి హుండీ ఆదాయం రూ.3.42 కోట్లు వచ్చినట్టు ఆలయ అధికారులు తెలిపారు. మే నెలలో ఆలయానికి వచ్చిన భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకల లెక్కింపు రెండు రోజులుగా ఆలయ ప్రాంగణంలోని వసంత మండపంలో జరిగింది. ఈ కానుకల్లో రూ.3,42,28,824 నగదు, 1,701 గ్రాముల బంగారం, 22,791 గ్రాముల వెండి, 1,237 విదేశీ కరెన్సీ కానుకగా సమర్పించారని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

కన్నియాకుమారి పర్యాటక పడవ ఛార్జీల పెంపు

పెరంబూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రం కన్నియాకుమారికి వచ్చే పర్యాటకులు సముద్రం మధ్యలో ఉన్న తిరువళ్లువర్ విగ్రహం, వివేకానంద రాక్‌కు పడవల్లో వెళుతుంటారు. పుంపుహార్ నౌకాయాన సంస్థ పర్యాటకుల సౌకర్యార్థం మూడు పర్యాటక పడవలు నడుపుతోంది. ఈ పడవల్లో ప్రయాణించేందుకు వసూలుచేస్తున్న ఛార్జీలు పెంచనున్నారు. ఆ ప్రకారం, సాధారణ ఛార్జీ రూ.75 నుంచి రూ.100, విద్యార్థుల ఛార్జీ రూ.30 నుంచి రూ.40కి పెంచినట్లు, రూ.300 ప్రత్యేక ఛార్జీలో ఎలాంటి మార్పు లేదని, ఛార్జీల పెంపు గురువారం నుంచి అమలుకు వస్తుందని పుంపుహార్ సంస్థ తెలియజేసింది.

బక్రీద్, వారాంతపు ప్రత్యేక బస్సులు

పెరంబూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగ, వారాంతపు సెలవుల సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం 1,608 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) ఒక ప్రకటనలో తెలిపింది. కిలాంబాక్కం బస్ టెర్మినల్ నుండి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోయంబత్తూర్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్ తదితర ప్రాంతాలకు శుక్రవారం 520 బస్సులు, శనివారం 550 బస్సులు నడుపున్నారు. కోయంబేడు బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, నాగపట్టణం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు ప్రాంతాలకు శుక్రవారం వంద బస్సులు, శనివారం 90 బస్సులు నడపనున్నారు. అలాగే, మాధవరం నుంచి శుక్ర, శనివారాల్లో తలా 24 బస్సులు, బెంగళూరు, తిరుప్పూర్, ఈరోడ్, కోవై తదితర ప్రాంతాల నుంచి పలు నగరాలకు 300 బస్సుల చొప్పున మొత్తం 1,608 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఎస్ఈటీసీ తెలిపింది.

మేట్టూరు డ్యాం పరిశీలన

పెరంబూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా మేట్టూరు డ్యాంను బుధవారం జలవనరుల శాఖ ఉన్నతాధికారులు పరిశీలించారు. కర్ణాటక రాష్ట్రంలోని కావేరి నది పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా మేట్టూరు డ్యాంలో నీటి మట్టం 113 అడుగులకు చేరుకుంది. కాగా మేట్టూరు డ్యాం నుంచి ప్రతి ఏడాది జూన్ 12న సాగునీరు విడుదల చేస్తుంటారు. ఈ ప్రకారం, ఈ ఏడాది డెల్టాకు సాగు నీరు విడుదల చేసేందుకు ఈ నెల 12న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సేలం రానున్నారు. డ్యాం కుడివైపున్న క్రస్ట్ గేట్లను ఎత్తివేసి నీటిని విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో, జలవనరుల శాఖ తిరుచ్చి మండల చీఫ్ ఇంజనీర్ దయాళకుమార్ నేతృత్వంలో అధికారులు డ్యాం కుడి, ఎడమ గట్లు, సొరంగం కాల్వలు, డ్యాంకు ఏర్పాటుచేసిన 16 క్రస్ట్ గేట్ల పటిష్టత తదితరాలు పరిశీలించారు.


క్రస్ట్ గేట్లు పరిశీలిస్తున్న చీఫ్ ఇంజనీర్ దయాళకుమార్

పాత సామాన్ల గోదాములో అగ్నిప్రమాదం

చెన్నై, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): తిరుపత్తూరు జిల్లా వాణియంబాడి వన్నియడిగళార్ నగరంలో పాత ఇనుప పరికరాల గోదాములో బుధవారం వేకువజాము న అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో లక్షలాది విలువైన సామగ్రి, ముఖ్యంగా కారు విడిభాగాలు ఈ ప్రమాదంలో దగ్ధమయ్యాయి. కుప్పన్ అనే వ్యక్తి నడుపుతున్న ఆ గోదాములో బుధవారం వేకువజాము ఉన్నట్టుండి దట్టమైన పొగలతో మంటలు చెలరేగాయి. అది చూసి స్థానికులు వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక దళం ఫైరింజన్‌తో వెళ్ళి సుమారు అరగంటకు పైగా పోరాడి మంటలను ఆర్పివేశారు. వాణియంబాడి పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.


మంటల్లో తగలబడుతున్న కారు విడిభాగాలు

● ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం...

సీబీసీఐడీ విచారణకు సిఫారసు

పెరంబూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి మనోన్మణియం సుందరనార్ విశ్వవిద్యాలయంలో ప్రశ్నాపత్రం లీకేజీ కేసును సీబీసీఐడీ విచారణకు సిఫారసు చేసినట్లు తిరునల్వేలి నగర పోలీస్ కమిషనర్ సంతోష్ హతిమణి తెలిపారు. ఈ వర్సిటీ పరిధిలో తిరునల్వేలి, తెన్‌కాశి, తూత్తుకుడి, కన్నియాకుమారి జిల్లాలకు చెందిన కళాశాలలున్నాయి. మే 24న బీకాం విద్యార్థులకు నిర్వహించిన 'ఇండస్ట్రియల్ లా' సెమిస్టర్ పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీ కావడంతో ఆ పరీక్షను తాత్కాలికంగా నిలిపివేసి, 30వ తేది నిర్వహించారు. ప్రశ్నాపత్రం లీకేజీపై విచారణ చేపట్టాలని వర్సిటీ రిజిస్ట్రార్ సోక్రటీస్ తిరునల్వేలి పెట్టై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. పోలీసుల విచారణలో ఎలాంటి పురోగతి లేకపోవడంతో, ఈ కేసు విచారణ సీబీసీఐడీకి బదిలీ చేయాలని సిఫారసు చేసినట్లు తిరునల్వేలి నగర పోలీస్ కమిషనర్ సంతోష్ హతిమణి తెలిపారు.

● రెండాకుల వ్యవహారం....

ఈసీకి వ్యతిరేకంగా ఢిల్లీ హైకోర్టులో పిటిషన్

అడయార్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రెండాకుల చిహ్నం వ్యవహారంలో ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ఢిల్లీ హైకోర్టులో కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన పిటిషన్‌ను పుహళేంది దాఖలుచేశారు. రాష్ట్రంలో ఖాళీ అవుతున్న ఆరు రాజ్యసభ సభ్యుల స్థానాల ఎంపికకు ఈ నెల 19న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు జాతీయ ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ నేపథ్యంలో, అన్నాడీఎంకే తరఫున పోటీచేసే అభ్యర్థులకు ఇచ్చే ఏ,బి ఫారాల్లో ప్రధాన కార్యదర్శిగా ఎడప్పాడి పళనిస్వామి సంతకం చేస్తే అవి చెల్లవని ప్రకటించాలని అన్నాడీఎంకే సమన్వయ కమిటీ సభ్యుడు పుహళేంది ఎన్నికల సంఘానికి వినతిపత్రం సమర్పించారు. అలాగే, పార్టీ చిహ్నానికి సంబంధించిన మద్రాసు హైకోర్టులో కేసు విచారణలో ఉందని వినతిపత్రంలో పేర్కొన్నారు. కానీ, ఈ వినతిపత్రంపై ఎన్నికల సంఘం ఎలాంటి చర్యలు చేపట్టలేదని, ఈ వ్యవహారంపై చర్యలు చేపట్టేలా ఎన్నికల సంఘానికి ఆదేశించాలని కోరుతూ పుహళేంది ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేశారు.

రథం ఊరేగింపులో వాగ్వాదం

శివకాశిలో అర్థాంతరంగా ఆగిన రథోత్సవం

చెన్నై, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): శివకాశిలో సుప్రసిద్ధ విశ్వనాథస్వామివారి ఆలయంలో వైకాశి విశాఖ ఉత్సవాల సందర్భంగా బుధవారం ఉదయం ప్రారంభమైన రథోత్సవం అర్థాంతరంగా ఆగింది. ఎన్నో ఏళ్లుగాఆ రథం వెళ్లే మార్గానికి బదులుగా మరో మార్గంలో రథాన్ని నిలపాలనే దేవాదాయ శాఖ అధికారుల ఆదేశాల కారణంగా గొడవ జరిగింది. పోలీసుల జోక్యంతో ప్రత్యామ్నాయ ప్రాంతంలో రథాన్ని ఉంచారు. విశ్వనాథస్వామివారి ఆలయంలో మే 27న వైకాశి విశాఖ ఉత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభమయ్యా యి. ఈ వేడుకల్లో అత్యంత ప్రధానఘట్టమైన రథోత్సవం బుధవారం ఉదయం ప్రారంభమైంది. రథం ప్రధాన వీధుల్లో ఊరేగి రథమండపం వీధిలోకి ప్రవేశిస్తున్న సమయంలో దేవాదాయ శాఖ అధికారులు రథాన్ని ఉత్తర వీధిలో నిలిపిఉంచాలని ఆదేశించారు. ఆలయ నిర్వాహకులు, స్థానికులు రథోత్సవం తర్వాత ఆలయం ముందున్న వీధిలో నిలిపి ఉంచడం ఆనవాయితీ అని, ఉత్తర వీధిలో రథాన్ని ఊరేగింపు తీసుకెళ్ళి నిలిపేందుకు అనుమతించే ప్రసక్తే లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో దేవాదాయ శాఖ అధికారులకు, ఆలయ నిర్వాహకులు, భక్తుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో తూర్పు వీధిలో సగం దూరం వరకు వెళ్ళిన రథాన్ని అర్థాంతరంగా నిలిపేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసు ఉన్నతాధికారులు హుటాహుటిన వెళ్లి దేవాదాయ శాఖ అధికారులతో చర్చించిన అనంతరం ఆలయం ముందే రథాన్ని నిలిపిఉంచేందుకు దేవాదాయ శాఖ అధికారులు అంగీకరించారు. ఆ తర్వాత రథాన్ని భక్తులు లాగుతూ ఆలయం ముందు నిలిపి ఉంచారు. పోలీసులతో ఆ ప్రాంతంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

బీఎస్పీ జెండాకు మా జెండాకు పోలికల్లేవు

● టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్

ప్యారీస్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) జెండాకు మా జెండాకు పోలికలు లేవని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రధాన ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ స్పష్టం చేశారు. సినీ నటుడు విజయ్ సారథ్యంలోని టీవీకే జెండాలో ఉన్న ఏనుగుల గుర్తు తొలగించాలని కోరుతూ బీఎస్పీ ప్రధాన కార్యదర్శి చెన్నై మానవ హక్కుల కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో బీఎస్పీ పిటిషన్ రద్దు చేయాలని కోరుతూ టీవీకే తరుపున రిట్ పిటిషన్ దాఖలైంది. ఈ సందర్భంగా వివాదాస్పదమైన పార్టీ జెండా వ్యవహారంపై టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ, బీఎస్పీ జెండాకు టీవీకే జెండాకు ఏ మాత్రం పోలికలు లేవని తమ పార్టీకి సిద్ధాంతాలు రాష్ట్రాభివృద్ధికి తోడ్పడతాయని, భావి తరాలకు ఉజ్వల భవిష్యత్ అందించేందుకు సహకరిస్తాయన్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు విద్యాసామగ్రి

వేలూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా పిల్లల సంక్షేమాభివృద్ధి పథకంలో జిల్లావ్యాప్తంగా ఉన్న 25,332 అంగన్వాడీ కేంద్రాలకు విద్యా సామగ్రి సరఫరా చేశారు. కలెక్టర్ సుబ్బులక్ష్మి బుధవారం ఉదయం పుస్తకాలు, యూనిఫాం కిట్లను పిల్లల తల్లిదండ్రులకు అందజేశారు. అదేవిధంగా కాట్పాడీలోని ఓ అంగన్వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ కదిర్ ఆనంద్ పాల్గొన్నారు. కార్యక్రమంలో వేలూరు డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్, మండల అధ్యక్షురాలు పుష్పలత, వన్నియరాజా, ప్రభుత్వ ఉన్నతాధికారులు ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఎంపీ తదితరులు

దిశా నిర్వహణపై సమావేశం...

వేలూరు ఎంపీ కదిర్ ఆనంద్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం డిస్ట్రిక్ట్ డెవలప్మెంట్ కో-ఆర్డినేషన్ అండ్ మోనిటోరింగ్ కమిటీ (దిశా) సమావేశం జరిగింది. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దిశా నిర్వహణ కమిటీ పనితీరు తదితరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, దిశా నిర్వాహక కమిటీ కార్యదర్శి సుబ్బులక్ష్మి, ఎమ్మెల్యే అమ్ములు, ఎస్పీ మదివానన్, రెవెన్యూ అధికారులు మాలతి, జానకీ పాల్గొన్నారు.

ముగిసిన కర్రసాము శిక్షణ తరగతులు

వేలూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా గుడియాత్తం సమీపంలోని నత్తం గ్రామంలో చిన్నారుల కర్రసాము శిక్షణ తరగతులు ముగిశాయి. సిలంబం శిక్షణ శిబిరం కమిటీ అధ్యక్షుడు శివకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా రిటైర్డ్ వ్యవసాయ శాఖ అధికారి విశ్వనాథన్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గుణవతి, ఇంజనీర్ జాన్ సెల్వమణి పాల్గొని చిన్నారులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో కర్రసాము శిక్షణా శిబిరం కమిటీ కార్యదర్శి శరవణన్, ఉపాధ్యక్షుడు ధరణీశ్వరన్, కర్రసాము విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

ప్రజా గ్రీవెన్స్‌లో 41 వినతులు


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న పోలీస్ కమిషనర్

పెరంబూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి):స్థానిక ఎగ్మూర్‌లోని నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో బుధవారం ప్రజా గ్రీవెన్స్ జరిగింది. ఈ గ్రీవెన్స్‌లో 41 వినతిపత్రాలు స్వీకరించిన గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ అరుణ్ సమస్యలను సత్వరం విచారించి తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులను ఆదేశించారు.

ఉపకులపతుల నియామకంపై స్టే

● సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం అప్పీలు

పెరంబూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు ఉపకులపతులను నియమించే అధికారం రాష్ట్ర ప్రభుత్వమే చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన బిల్లుకు సుప్రీంకోర్టు అనుమతులు మంజూరు చేసింది. అనంతరం ఉపకులపతుల నియామకాలకు సంబంధించిన బిల్లును రాష్ట్ర ప్రభుత్వం గెజిట్‌లో ప్రచురించింది. ఈ చట్టం రద్దు చేయాలని కోరుతూ తిరునల్వేలికి చెందిన న్యాయవాది వెంకటాచలపతి మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ విచారించిన మద్రాసు హైకోర్టు, ప్రధాన పిటిషన్‌పై స్పందించాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ, మధ్యంతర ఇంజక్షన్ పిటిషన్‌పై విచారణ వాయిదావేసింది. ఈ కేసులో అందరి వాదనలు విన్న హైకోర్టు, ఉపకులపతులను నియమించే ఛాన్సలర్ అధికారం ప్రభుత్వానికి అప్పగిస్తూ ఆమోదించిన చట్టపరమైన నిబంధనలపై మధ్యంతర స్టే విధించింది. ఈ నేపథ్యంలో, మద్రాసు హైకోర్టు మధ్యంతర స్టే ను వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీలు పిటిషన్ దాఖలుచేసింది. ఈ పిటిషన్ త్వరలో విచారణకు రానున్నట్లు సమాచారం.

తిరుచెందూర్ ఆలయ కుంభాభిషేకం వేళల మార్పు

● పిటిషన్ తోసిపుచ్చిన సుప్రీంకోర్టు

చెన్నై, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూర్ ఆలయ కుంభాభిషేకం 15 ఏళ్ల అనంతరం జూలై 7వ తేది జరుగనుంది. ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో, కుంభాభిషేకాన్ని ముహూర్తం సమయం మధ్యాహ్నం 12.05 నుంచి 12.45 గంటల వరకు నిర్వహించేలా ఉత్తర్వులివ్వాలని కోరుతూ శివరామ్ సుబ్రమణ్యశాస్త్రి దాఖలుచేసిన అప్పీలు పిటిషన్ బుధవారం న్యాయమూర్తులు ప్రశాంత్‌కుమార్ మిశ్రా, అగస్టిన్ జార్జ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. ఇదే అంశంపై వచ్చిన మరో పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు ఇదివరకే తోసిపుచ్చింది. అందువల్ల ఆ ఉత్తర్వుల్లో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసిన ధర్మాసనం, అప్పీలు పిటిషన్ తోసిపుచ్చుతూ ఉత్తర్వులు జారీ చేసింది.

మదురై విమానాశ్రయంలో కొవిడ్ పరీక్షలు

పెరంబూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మదురై విమానాశ్రయానికి వచ్చే ప్రయాణికులకు కొవిడ్ పరీక్షలు నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా కొవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. ఈ చర్యల్లో భాగంగా మదురై విమానాశ్రయంలో 24 గంటలు నిఘా ఏర్పాటుచేశారు. జ్వరం, దగ్గు సమస్యలతో వచ్చే ప్రయాణికులను మానిటరింగ్‌తో పరీక్షిస్తున్నారు. వారికి కొవిడ్ లక్షణాలను బట్టి ప్రభుత్వాసుపత్రికి పంపుతున్నట్లు అధికారులు తెలిపారు.

తిరుప్పూర్‌లో ప్రత్యేక వార్డు...

తిరుప్పూర్ ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రిలో కొవిడ్ ముందస్తు చర్యల్లో భాగంగా 30 పడకలతో కొవిడ్ వార్డు ఏర్పాటైంది. ఆక్సిజన్, వెంటిలేటర్, అత్యవసర మందులతో ప్రత్యేక వైద్యబృందాన్ని నియమించారు. జిల్లాలో కొవిడ్ కేసులు నిర్ధారణ కాకపోయినా, ముందు జాగ్రత్త చర్యగా కొవిడ్ వార్డు ఏర్పాటుచేసారు. కొవిడ్ వ్యాప్తి తక్కువగా ఉందని ప్రజలు నిర్లక్ష్యం వహించరాదని, ముందు జాగ్రత్త చర్యలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

సీతారాం నగర్ దహనవాటిక మూసివేత

పెరంబూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక తండయార్‌పేట మండలం 34వ వార్డు పరిధిలోని సీతారాం నగర్ దహన వాటిక మరమ్మతుల కారణంగా బుధవారం నుంచి ఈ నెల 24వ తేది వరకు మూసివేయనున్నారు. ఆ సమయంలో ప్రజలు సమీపంలోని ముల్లైనగర్ దహన వాటిక వినియోగించుకోవచ్చని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఒక ప్రకటనలో తెలిపింది.

అరుంబాక్కం...

అన్నానగర్ మండలం 103వ వార్డు పరిధిలోని అరుంబాక్కం హిందూ దహనవాటికలో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా ఈ నెల 12వ తేది వరకు మూసివేయనున్నట్లు, ఆ సమయంలో ప్రజలు సమీపంలోని విల్లివాక్కం, వేలంగాడు శ్మశానవాటికలను వినియోగించుకోవచ్చు.

రేపు, 7న చెన్నై-గూడూరు మార్గంలో సబర్బన్ రైళ్ల పాక్షిక రద్దు

అడయార్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్-గూడూరు మధ్య గురువారం, శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 17 సబర్బన్ రైళ్లు పాక్షికంగా రద్దు చేసినట్టు దక్షిణ రైల్వే తెలిపింది. చెన్నై సెంట్రల్-గూడూరు సెక్షన్ కవర పేట-గుమ్మిడిపూండి మధ్య రైలు మార్గాల్లో మరమ్మతుల కారణంగా గురువారం, శనివారం ఉదయం 11.15 నుంచి మధ్యాహ్నం 3.15 గంటల వరకు సబర్బన్ రైళ్లు రద్దు చేశామని, ఆ సమయంలో మీంజూరు, పొన్నేరి నుంచి చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్‌కు ఆరు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

ఇన్‌స్టాగ్రాం పరిచయం.. ప్రేమ విఫలం

ప్లస్ టూ విద్యార్థిని ఆత్మహత్య

పెరంబూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన యువకుడు, ప్రేమకు నిరాకరించడంతో మనస్తాపం చెందిన ప్లస్ టూ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. కోయంబత్తూర్ జిల్లా పొల్లాచ్చి జ్యోతినగర్ ఎంజీఆర్ నగర్‌కు చెందిన మురుగానందం కుమార్తె సారిక (17) ప్లస్ టూ చదువుతోంది. సారికకు ఇన్‌స్టాగ్రామ్‌లో 21 ఏళ్ల యువకుడితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. వారిద్దరూ సెల్‌ఫోన్‌లో చాలాసేపు మాట్లాడుకునేవారు. ఈ క్రమంలో, ఆ యువకుడు కొద్దిరోజులుగా సారికతో మాట్లాడడం తగ్గించినట్లు, నిన్ను ప్రేమించడం లేదని మెసేజ్ పంపినట్లు తెలిసింది. దీంతో, మనస్తాపం చెందిన సారిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాను ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై పొల్లాచ్చి ఈస్ట్ టౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

చెన్నై, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక వళ్లువర్‌కోట్టం సమీపంలో విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందాడు. కోయంబత్తూర్‌కు చెందిన ప్రకాష్‌రాజ్ (35) అదే ప్రాంతంలోని ఓ ప్రైవేటు బీమా సంస్థలో పనిచేస్తున్నాడు. అతను నెల రోజుల శిక్షణ నిమిత్తం వళ్లువర్‌కోట్టం సమీపంలో ఆ సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చాడు. మంగళవారం సాయంత్రం ప్రకాష్‌రాజ్ స్నేహితులతో కలసి వళ్లువర్‌కోట్టం సమీపంలోని దుకాణంలో టీ తాగేందుకు వచ్చాడు. ఆ సమయంలో చిన్నగా వర్షం కురుస్తోంది. దుకాణానికి ఉన్న నేమ్ బోర్డు విద్యుత్ తీగ తెగి, నడక మార్గంలో ఇనుప రాడ్ మీద పడి, విద్యుత్ సరఫరా జరిగినట్టు సమాచారం. ఆ సమయంలో ప్రకాష్ రాజ్ ఇనుప రాడ్‌పై చేయి వేయడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్నేహితులు వెంటనే 108 అంబులెన్స్ సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది అక్కడకు చేరుకుని అతడిని పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై నుంగంబాక్కం పోలీసులు కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

తమ్ముడి మృతి తట్టుకోలేక అన్నకూడా....

చెన్నై, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మృత్యువు కూడా ఆ అన్నాదమ్ముల అనుబంధాన్ని వేరుచేయలేకపోయింది. తమ్ముడు మృతిచెందాడని తెలిసి దిగ్భ్రాంతి గురైన అన్న కూడా మృతిచెందిన ఘటన కోయంబత్తూర్ జిల్లాలో చోటుచేసుకుంది. కోవై కుడియలూరు సమీపం సెంగాళిపాళయం ప్రాంతానికి చెందిన నాగరాజ్ (64), తమ్ముడు దేవరాజ్ (57)సెంగాళిపాళయంలో నివిస్తున్నారు. నాగరాజ్ ఆస్తమా కారణంగా కోవై సింగానల్లూర్‌లోని ఈఎస్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దేవరాజ్ ఇటీవల స్టంట్ వేయించుకుని పది రోజులుగా ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో, దేవరాజ్ మంగళవారం రాత్రి 7.15 గంటలకు హఠాత్తుగా మృతిచెందాడు. ఈ విషయాన్ని ఈఎస్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగరాజ్‌కు బంధువులు తెలియజేశారు. తమ్ముడు మృతితో మనస్తాపం చెందిన నాగరాజ్ రాత్రి 10.15 గంటలకు మృతిచెందాడు. అన్నాతమ్ముడు ఒకేరోజు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కారు ఢీకొని ...

అడయార్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రిప్లికేన్‌లో కారు ఢీకొని యువతి మృతిచెందిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వాషర్‌మెన్‌పేటకు చెందిన వలర్మతి (40) ట్రిప్లికేన్‌లోని ఓ బుక్ షాప్‌లో పనిచేస్తోంది. మంగళవారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు వాలాజా రోడ్డు దాటుతున్న సమయంలో వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రగాయాలైన వలర్మతిని చుట్టుపక్కల వారు సమీపంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన అన్నా స్క్వయర్ పోలీసులు, ఈ ప్రమాదానికి కారణమైన వెప్పేరి ప్రాంతానికి చెందిన అశోక్‌బదాన్ (70)ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఆలయాల్లో నృత్య ప్రదర్శనలు

● నిబంధనలతో అనుమతించిన హైకోర్టు

అడయార్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆలయాల్లో పాటలు, నృత్య ప్రదర్శనల నిర్వహణకు నిబంధనలతో కూడిన అనుమతులిస్తూ హైకోర్టు మదురై బెంచ్ ఉత్తర్వులు జారీచేసింది. హైకోర్టు మదురై డివిజన్ పరిధిలోని 14 జిల్లాల్లో ఆలయ వేడుకల్లో పాట కచ్చేరి, నృత్య ప్రదర్శనలకు అనుమతించాలంటూ పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్ బుధవారం విచారణకు రాగా శాంతి భద్రతల కారణంగా పోలీసులు పాట కచ్చేరి, నృత్య ప్రదర్శనలకు అనుమతులివ్వడం లేదని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. ఈ కేసులో అందరి వాదనల అనంతరం న్యాయమూర్తి ఇచ్చిన ఉత్తర్వుల్లో... పాటలు, నృత్య కార్యక్రమాలు నిర్వహించే వారు స్థానిక సంస్థల కార్యదర్శులకు రూ.25 వేలు చెల్లించాలన్నారు. ఈ నగదును గ్రామంలోని నీటివనరులను శుభ్రపరిచేందుకు వినియోగించాలనే నిబంధన విధిస్తూ పాట వచ్చేరి, నృత్య ప్రదర్శనలకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లలో స్లీపర్ బోగీల తగ్గింపు

● పేద, మధ్య తరగతి ప్రయాణికుల అవస్థలు


ప్యారీస్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నడుపుతున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లలో స్లీపర్ బోగీల సంఖ్య తగ్గించి, ఆదాయం పెంచాలని అధికారులు భావిస్తున్నారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఏసీ బోగీలను పెంచేందుకు దక్షిణ రైల్వే తీసుకున్న నిర్ణయం వల్ల పేద,మధ్య తరగతి ప్రయాణికులు ఇబ్బందులు పడే అవకాశముంది. రాష్ట్రంలోని పేద,మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వ్యక్తులు దూర ప్రాంతాలకు వెళ్ళేందుకు రైళను మాత్రమే నమ్ముకున్నారు. తక్కువ ఛార్జీలతో రిజర్వేషన్ లేకుండా జనరల్ బోగీల్లో ప్రయాణించేందుకు సామాన్య ప్రజలు ఇష్టపడుతుంటారు. అదేవిధంగా ఎక్స్‌ప్రెస్ రైళ్లలో సెకండ్ క్లాస్ స్లీపర్ కోచ్‌లను తగ్గించి ఏసీ కోచ్‌ల సంఖ్య పెంచేందుకు దక్షిణ రైల్వే తీసుకున్న నిర్ణయం ఆగస్టు 2వ తేదీ నుండి అమలుకానుండటంపై పేద,మధ్య తరగతి ప్రయాణికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ నిర్ణయం వల్ల నలుగురు వ్యక్తులు కలిగిన సామాన్య కుటుంబం ఇకనుంచి ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ప్రయాణం చేసేందుకు రూ.5వేలకు పైగా ఖర్చు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. రైల్వేశాఖ ఇప్పటికే సేవా దృక్పథానికి దూరమైందని, కార్పొరేట్ సంస్థలకు ఈ శాఖలో భాగస్వామ్యం కల్పించిందని, సామాన్య ప్రయాణికుల సంక్షేమం గురించి రైల్వేశాఖ పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

మామిడి పండ్ల ధర ప్రభుత్వమే నిర్ణయించాలి

● పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి

ప్యారీస్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమార్థం మామిడి పండ్ల ధర ప్రభుత్వమే నిర్ణయించాలని పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది మామిడి పండ్ల దిగుబడి అధికంగా ఉన్నందున వ్యాపారులు తక్కువ ధరకు విక్రయిస్తున్నారని, ఇందువల్ల మామిడి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. అందువల్ల మామిడి రైతులు, లీజుదారులకు ఎకరాకు నష్టపరిహారంగా రూ.లక్ష ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మామిడి పండ్ల సీజన్‌లో రైతులను ఆర్థిక పరంగా ఆదుకునేందుకు ప్రభుత్వమే ధర నిర్ణయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఘనంగా కొల్లాపురమ్మ జాతర


ఊరేగింపులో కొల్లాపురమ్మ, పొనియమ్మవార్ల ఉత్సవమూర్తులు - అమ్మవారి ఉత్సవంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు

తిరుత్తణి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు తాలూకాలోని సామంతవాడలో ప్రారంభమైన కొల్లాపురమ్మ, పొనియమ్మవార్ల జాతర ఘనంగా జరుగుతోంది. ఈ నేపథ్యంలో, బుధవారం పెద్దసంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయం వద్ద భక్తులు పొంగళ్లు పెట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు ఆలయ అర్చకులు అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకరించి, వాహనంలో కొలువుదీర్చారు. అనంతర మేళతాళాల మధ్య అమ్మవార్ల ఊరేగింపు సాగింది. ఈ కార్యక్రమంలో సామంతవాడ గ్రామపెద్దలు జనార్ధన్ రెడ్డి, రామ్మూర్తి రెడ్డి, రాజారెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, చెంగయ్య గౌడ్, శంకరగౌడ్, జ్ఞానశేఖర్, భక్తులు పాల్గొన్నారు.

చిత్రజ్యోతి



'జన నాయగన్'లో విజయ్

'జన నాయగన్' షూటింగ్ పూర్తి

హెచ్.వినోద్ దర్శకత్వంలో అగ్ర హీరో విజయ్ నటిస్తున్న తాజా చిత్రం 'జన నాయగన్' షూటింగ్ పూర్తి చేసుకున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. చివరి దశ నిర్మాణ పనులు చెన్నైలో ముగించారు. ఈ సినిమా నిర్మాణంలో పాలుపంచుకున్న నటీనటులతో పాటు సాంకేతిక సభ్యులకు, ఇతర యూనిట్ సభ్యులందరికీ షూటింగ్ చివరి రోజు మాంసాహార విందు కూడా ఏర్పాటు చేశారన్నది చిత్ర వర్గాల సమాచారం. కాగా, ఈ నెల 22వ తేదీ విజయ్ పుట్టిన రోజున ఈ మూవీ టీజర్ రిలీజ్ చేయనున్నారు. ఇదిలావుంటే, విజయ్ రాజకీయ రంగ ప్రవేశం చేయడంతో ఆయన నటించే చివరి చిత్రం ఇదేనని భావిస్తున్నారు. ఇందులో బాబీ డియోల్, పూజా హెగ్డే, మమితా బైజు తదితరులు నటించారు. 2026 సంక్రాంతికి సినిమా విడుదలకానుంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటుంది.

అండగా నిలబడిన తమిళనాడుకు ధన్యవాదాలు

- కమల్ హాసన్



'ఉయిరే.. ఉరవే... తమిళే' అనే పదాలకు వాస్తవ అర్థాన్ని ఇపుడు గ్రహించానని, తనకు అండగా నిలబడిన తమిళనాడుకు ధన్యవాదాలు అని అగ్ర నటుడు కమల్ హాసన్ పేర్కొన్నారు. మణిరత్నం దర్శకత్వంలో తాను హీరోగా నటించిన తాజా చిత్రం 'థగ్ లైఫ్'. గురువారం ప్రపంచ వ్యాప్తంగా తమిళం, తెలుగు, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో విడుదలకానుంది. దీన్ని పురస్కరించుకుని చిత్ర బృందం బుధవారం నగరంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటుచేసింది. ఇందులో హీరో కమల్ హాసన్ మాట్లాడుతూ, 'అంతర్జాతీయ సాంకేతిక నిపుణులు, గొప్ప నటీనటులతో కలిసి ఈ చిత్రాన్ని నిర్మించాం. 'థగ్ లైఫ్' కోసం అనేక మంది శ్రమించారు. ప్రతి ఒక్కరూ మణిరత్నం దర్శకత్వంలో నటించాలని కలలు కంటారు. అలాగే, నేను కూడా కొన్నేళ్ళ తర్వాత నటించడం ఆనందంగా ఉంది. 'నాయకన్' మణిరత్నం ఇపుడు జ్ఞాని మణిరత్నంగా మారిపోయారు. 'థగ్ లైఫ్' కోసం కలిసి పనిచేయడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ సందర్భంలో నాకు అండగా నిలబడిన తమిళనాడుకు ధన్యవాదాలు. ఆ అంశంపై ఖచ్చితంగా నా అభిప్రాయాలను పంచుకుంటాను. ఒక తమిళుడిగా వివరిస్తాను కూడా. 'థగ్ లైఫ్'లో నటించిన ప్రతి ఒక్కరూ సినిమా బాగుందని చెప్పడం సహజం. కానీ, మీ అందరి అభిప్రాయం కోసం ఎదురుచూస్తున్నాను' అని పేర్కొన్నారు. హీరో శింబు మాట్లాడుతూ, 'ప్రతి ఒక్కరిలాగే మణిరత్నం, కమల్ హాసన్‌తో కలిసి నటించడం ఆనందంగా ఉందన్నారు. నటుడు నాజర్ మాట్లాడుతూ, 'మణిరత్నం, కమల్ హాసన్‌తో నటించే ఛాన్స్ రావడం సంతోషంగా ఉంది' అన్నారు. హీరో అశోక్ సెల్వన్ మాట్లాడుతూ, 'ఒకేసారి మణిరత్నం, కమల్ హాసన్, రెహ్మాన్ కాంబినేషన్‌లో నటించే ఛాన్స్ రావడం అదృష్టం' అన్నారు.

రవి మోహన్ - ఎస్‌జే సూర్య కాంబోలో కొత్త చిత్రం



ఎస్‌జే సూర్య - రవి మోహన్

ప్రముఖ హీరో రవి మోహన్, దర్శక నటుడు ఎస్‌జే సూర్య కలిసి ఒక చిత్రంలో నటించనున్నారు. 'వడకుపట్టి రామస్వామి' 'డిక్కీలోనా' వంటి చిత్రాలను రూపొందించిన కార్తిక్ యోగి ఈ సినిమాకు దర్శకుడు. ఇందులో ఎస్‌జే సూర్య హీరోగా నటిస్తుండగా, రెండో హీరోగా రవి మోహన్‌ను ఎంపిక చేశారు. ఇదిలావుంటే రవి మోహన్ పొలిటికల్ థ్రిల్లర్ 'కరాటే బాబు' మూవీలో నటించారు. గణేష్ బాబు దర్శకుడు. మరోవైపు యోగి బాబు హీరోగా రవి మోహన్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కనుంది. ఈ సినిమా పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. తన వ్యక్తిగత జీవితంలో సమస్యలు తలెత్తినప్పటికీ రవి మోహన్ మాత్రం తన సినీ కెరీర్‌కు ఎలాంటి ఆటంకం కలుగకుండా ముందుకు తీసుకెళుతున్నారు.

మద్య నిషేధాన్ని జాతీయ అంశంగా పరిగణించాలి : తిరుమా

- లిజి ఆంటోనీ ప్రధాన పాత్రలో 'కుయిలి'

నటి లిజి ఆంటోనీ ప్రధాన పాత్ర పోషించిన చిత్రం 'కుయిలి' చిత్రం ఆడియో రిలీజ్ వేడుక నగరంలో జరిగింది. ఇందులో డీపీఐ ప్రధాన కార్యదర్శి, లోక్‌సభ సభ్యుడు తోల్ తిరుమావళవన్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు. బీఎం ఫిల్మ్ ఇంటర్నేషనల్ పతాకంపై వీవీ అరుణ్ కుమార్ నిర్మాణ సారథ్యంలో డెబ్యూ డైరెక్టర్ పి.మురుగస్వామి దర్శకత్వంలో ఈ మూవీ రూపుదిద్దుకుంది. లిజి ఆంటోనీ ప్రధాన పాత్ర పోషించిన ఈ సినిమాలో దష్మిక లక్ష్మణ్, పుదుపేట్ సురేష్, వీవీ అరుణ్ కుమార్, శరణ్ భాస్కర్ తదితరులు నటించారు. ఆడియో రిలీజ్ వేడుకలో దర్శకుడు మురుగస్వామి మాట్లాడుతూ, 'నేను కార్ల్‌మార్క్స్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, పెరియార్‌లను చూడలేదు. కానీ, ఈ ముగ్గురు ప్రతిరూపంగా తిరుమావళవన్‌ను చూస్తున్నాను. చిన్న వయసు నుంచే ఆయన పోరాట పటిమా ప్రసంగాలను వినేవాడిని. సినీ దర్శకుడు పా.రంజిత్‌ను చూస్తూ పెరిగాను. సమాజంలోని ఒక ప్రధాన కథాంశాన్ని తీసుకుని రూపొందించాను' అని వెల్లడించారు. నటి లిజి ఆంటోనీ మాట్లాడుతూ, 'ఆత్మగౌరవం, పోరాట గుణం, పట్టుదల, ఓర్పు అనే ఈ నాలుగు అంశాలపై అధిక నమ్మకం కలిగిన వ్యక్తిని. వీటినే నా వ్యక్తిగత జీవితంలోనూ పాటిస్తున్నాను. ఈ గుణాలే నిర్మాత అరుణ్ కుమార్ దగ్గరున్నాయి. నా జీవితంలో ఒక సినిమా కోసం నన్ను సంప్రదించిన తొలి నిర్మాత ఆయనే. ఆ తర్వాత ఆయన స్టోరీ నరేట్ చేసిన విధానం మరిచిపోలేనిది. ఈ సినిమాకు 'కుయిలి' అని టైటిల్ పెట్టాలని సూచించగా, నిర్మాత వెంటనే సమ్మతించారు. ఈ మూవీని విజయవంతం చేయాలని మీడియాను, సినిమా అభిమానులను ఆమె కోరారు. తోల్ తిరుమావళవన్ మాట్లాడుతూ, 'నేటి సమాజంలో సమాజ బాధ్యతగా భావించి మద్యానికి వ్యతిరేకంగా ఒక సినిమా తీయాలంటే ఎంతో ధైర్యం కావాలి. ఈ విషయంలో దర్శక నిర్మాతలను ప్రత్యేకంగా అభినందిస్తున్నాను. కమర్షియల్‌గా సినిమాలు నిర్మించి, అవి విజయం సాధించి, లాభాపేక్ష లేకుండా సామాజిక బాధ్యతతో సినిమా తీశారు. ఇటీవల మద్య, మత్తు పదార్థాల నిర్మూలన మహానాడు తమ పార్టీ నిర్వహించింది. దానిపై ఎన్నో విమర్శలు వచ్చాయి. మద్యం, డ్రగ్స్ వల్ల కేవలం మన రాష్ట్రానికి చెందిన యువత మాత్రమే కాకుండా, దేశ వ్యాప్తంగా వ్యసనాలకు బానిస అవుతున్నారు. అందువల్ల మద్య నిషేధాన్ని జాతీయ అంశంగా పరిగణించాలని ఆయన కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



ఆడియో రిలీజ్ వేడుకలో చిత్ర బృందం

ఒకటో తరగతిలో చేరితే రూ.5వేలు

- విద్యార్థులకు టీచర్ల ఆఫర్

చెన్నై, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఆంగ్లభాషపై మోజుతో ప్రైవేటు పాఠశాలలో చేరే విద్యార్థుల సంఖ్య పెరిగి, ప్రభుత్వ పాఠశాలల్లో చేరేవారి సంఖ్య క్రమంగా తగ్గుతోంది. ఈ పరిస్థితి మార్చేందుకు నీలగిరి జిల్లాలోని ఓ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు ఓ నిర్ణయం తీసుకున్నారు. తమ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థుల సంఖ్య పెంచే దిశగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థులకు వారి పేరుతో బ్యాంక్‌లో రూ.5 వేలు డిపాజిట్ చేసే పథకానికి శ్రీకారం చుట్టారు. నీలగిరి జిల్లా ఊటీ సమీపం కీకూరు అనే ప్రాంతంలో కోక్లాడా ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఉన్నాయి. విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో ఆ పాఠశాలలను కొన్నేళ్ళ క్రితం మూసివేశారు. దీంతో ఊరి పెద్దలు, ఆ పాఠశాల పూర్వ విద్యార్థులంతా కలిసి చొరవ తీసుకోవడంతో ఆ పాఠశాలలను మూడేళ్ల తర్వాత మళ్ళీ తెరిచారు. ప్రస్తుతం ఆ పాఠశాలల్లో చుట్టు పక్కలి ప్రాంతాలకు చెందిన 42 మంది విద్యార్థులు మాత్రమే చదువుతున్నారు. ఆ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు గ్రామపెద్దలు, పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులంతా కలిసి ఓ పథకాన్ని అమలు చేయడాన్ని సిద్ధమయ్యారు. ఆ ప్రకారం ఆ పాఠశాలలో ఒకటో తరగతిలో చేరే విద్యార్థులకు రూ.5వేలు వారి బ్యాంక్ ఖాతాలో డిపాజిట్ చేస్తున్నారు. అదే విధంగా 6వ తరగతిలో చేరే విద్యార్థులకు రూ.5 వేలు, 7వ తరగతి చేరే విద్యార్థులకు రూ.4 వేలు, 8వ తరగతిలో చేరే విద్యార్థులకు రూ.3 వేలు, 9వ తరగతిలో చేరే విద్యార్థులకు రూ.2 వేలు చొప్పున వారి పేర్లతో బ్యాంక్ ఖాతాల్లో డిపాజిట్ చేస్తున్నారు. ఆ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసుకున్నప్పుడు ఆ నగదును విద్యార్థులకు అందజేస్తారు. ఈ నగదుతోపాటు రెండు జతల యూనిఫాం, ట్రాక్‌సూట్, స్కూలు బ్యాగ్, పాదరక్షలు, నోటు పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. వీటితో పాటు ఇంటి నుండి బడికి వాహన సదుపాయం కూడా కల్పిస్తున్నారు. ప్రస్తుతం ఆ రెండు పాఠశాలలు తెరవటంతో ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, పూర్వవిద్యార్థులంతా గ్రామాల్లో పర్యటిస్తూ తమ పాఠశాలల్లో చేరితే ఇస్తున్న నగదు కానుకలు, ఉచిత విద్యా ఉపకరణాల పంపిణీ గురించి తెలిపే కరపత్రాలను ప్రజలకు పంచిపెడుతున్నారు. ప్రస్తుతం ఇంటింటికీ వెళ్ళి తమ పాఠశాలలకు విద్యార్థులను పంపమంటూ వారి తల్లిదండ్రులను కలుసుకుని ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు అమలు చేస్తున్న ఈ నగదు పథకానికి మంచి స్పందన లభిస్తోంది. ఆ రెండు పాఠశాలల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది.



ఊటీలో ఓ బాలిక, ఆమె తల్లికి వివరిస్తున్న ఉపాధ్యాయులు



వళ్ళి, దైవానై సమేత దండాయుధపాణి స్వామివారు. ఇన్‌సెట్‌లో ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు

పళనిలో వైకాశి విశాఖ ఉత్సవాలు ప్రారంభం

చెన్నై, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పళని దండాయుధపాణి ఆలయంలో వైకాశి విశాఖ ఉత్సవాలు మంగళవారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. సుబ్రహ్మణ్యస్వామి కొలువైన ఆరు దివ్యక్షేత్రాల్లో రెండవదైన పళని దండాయుధపాణి ఆలయంలో జరిగే వేడుకల్లో వైకాశి విశాఖ వేడుకలు అత్యంత ప్రధానమైనవి. ఈ యేడాది వైకాశి విశాఖ వేడుకలు దండాయుధపాణి ఆలయానికి అనుబంధంగా ఉన్న పెరియనాయకి అమ్మన్ ఆలయంలో మంగళవారం ఉదయం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ధ్వజ మండపంలో వళ్ళి, దైవానై సమేత ముత్తుకుమారస్వామి ప్రత్యేక అలంకరణలతో వేంచేశారు. ధ్వజస్తంభానికి, పతాకానికి పూజలు చేసిన అనంతరం, మంగళవాయిద్యాలు, శైవపండితుల మంత్రోచ్చారణ నడుమ ఆలయ ప్రధానార్చకులు ధ్వజారోహణం జరిపారు. పదిరోజులపాటు ఈ వేడుకలలో ఈ నెల 8 రాత్రి తిరుకల్యాణోత్సవం, 9 ఉదయం రథోత్సవం జరుగనున్నాయి.

రన్‌వే నుంచి పక్షులను తరిమేందుకు కొత్త పరికరం



పెరంబూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కం విమానాశ్రయంలో విమానాలకు ఇబ్బంది కలిగిస్తున్న పక్షులను తరిమేందుకు కొత్త పరికరం పరిచయం చేశారు. ఈ విమానాశ్రయం నుంచి ప్రతిరోజు వంద విదేశీ, 400లకు పైగా స్వదేశీ విమానాలు వెళ్తుంటాయి. విమానాలు రన్‌వే నుంచి టేకాఫ్ అయ్యే సమయంలో పక్షుల బెడద అధికంగా ఉంటోంది. దీంతో, సిబ్బంది టపాసులు కాల్చడం, పెద్ద శబ్దం చేయడం తదితరాలు చేపట్టి పక్షులను తరిమేస్తున్నారు. ఈ నేపథ్యంలో, తాజాగా, పక్షులు తరిమేందుకు 'థండర్ బూమ్స్' అనే పరికరం వినియోగించనున్నారు. పిడుగులాంటి శబ్దం కలుగజేసే ఈ పరికరం వినియోగం వల్ల వంద శాతం ఫలితం ఉంటుందని విమానాశ్రయ అధికారులు తెలిపారు.

ముగిసిన 'అగ్నిపథ్' సైనిక శిక్షణ



సైనికుల కవాతు

పెరంబూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా కున్నూర్‌లోని వెల్లింగ్టన్ సైనిక శిక్షణా కేంద్రంలో ఆరు నెలల శిక్షణ పూర్తిచేసుకున్న 498 అగ్నిపథ్ సైనికులు సత్య ప్రమాణం చేశారు. భగవద్గీత, బైబిల్, ఖురాన్ తదితర పవిత్ర గ్రంథాలు, జాతీయ పతాకంపై చేయి ఉంచి సైనికులు సత్యప్రమాణం చేశారు. అనంతరం సైనికులు నిర్వహించిన మార్చ్ ఫాస్ట్, గౌరవ వందనాన్ని మేజర్ జనరల్ వీటీ మాథ్యూ, కమాండెంట్ క్రిస్టేదాస్ స్వీకరించారు. సైనికులు తల్లిదండ్రుడు, కుటుంబ సభ్యులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లకు కౌన్సెలింగ్ ప్రారంభం



కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

చెన్నై, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలల్లో అడ్మిషన్లకు కౌన్సెలింగ్ బుధవారం ప్రారంభమైంది. కళాశాలల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ మే 7 ప్రారంభమై 27 వరకు కొనసాగింది. ఆ తర్వాత దివ్యాంగులు, క్రీడాకారులు, మాజీ సైనికుల పిల్లలకు సంబంధించిన ప్రత్యేక ర్యాంకింగ్ జాబితా మే 29న విడుదల చేశారు. ఇదే విధంగా జనరల్ కేటగిరీ ర్యాంకింగ్ జాబితా మే 30న విడుదలైంది. ఈ నేపథ్యంలో జనరల్ కేటగిరీ విద్యార్థులు ర్యాంకింగ్ ప్రకారం కాలేజీలను ఎంపికచేసుకునేందుకు బుధవారం రాజధాని (ప్రెసిడెన్సీ) కళాశాలలో కౌన్సెలింగ్ ప్రారంభమైంది. బుధవారం ఉదయం నుండే కళాశాలలో విద్యార్థుల సందడి అధికమైంది. అధ్యాపకుల సమక్షంలో విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ నెల 14 వరకు కౌన్సెలింగ్ జరుగనునందని కళాశాలల విద్యాశాఖ ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

రేపు డ్రైవర్ రహిత మెట్రో రైలు ట్రయల్ రన్



పెరంబూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక పూందమల్లి-పోరూర్ మధ్య మూడో విడత డ్రైవర్ రహిత మెట్రోరైలు ట్రయల్ రన్ శుక్రవారం నిర్వహించనున్నారు. నగరంలో రెండో విడత మెట్రోరైలు ప్రాజెక్టులో 116 కి.మీ మూడు మార్గాల్లో ఏర్పాటు కానున్నాయి. ఈ మార్గాల్లో లైట్ హౌస్-పూందమల్లి హైరోడ్డు మధ్య లైట్ హౌస్ నుండి కోడంబాక్కం పై ఓవర్ వరకు సొరంగ మార్గం, కోడంబాక్కం పవర్ హౌస్ నుండి పూందమల్లి హైరోడ్డు వరకు పై ఓవర్లపై మెట్రో మార్గం నిర్మితమవుతోంది. ఈ మార్గంలో పూందమల్లి-పోరూర్ మధ్య పై ఓవర్ మార్గం పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ మార్గంలో డిసెంబరులో మెట్రోరైలు సేవలు ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో, ఈ మార్గంలో గత మార్చి 20వ తేది తొలివిడతగా పూందమల్లి-ముల్లై గార్డన్ మధ్య 3 కి.మీ దూరం డ్రైవర్ రహిత మెట్రో రైలు ట్రయల్ రన్ నిర్వహించారు. అనంతరం ఏప్రిల్ 28న నిర్వహించిన రెండో విడత ట్రయల్ రన్ విజయవంతమైంది. ఈ నేపథ్యంలో, పూందమల్లి-పోరూర్ మధ్య మూడవ విడత డ్రైవర్ రహిత మెట్రోరైలు ట్రయల్ రన్ శుక్రవారం నిర్వహించనున్నట్టు సీఎంఆర్ఎల్ అధికారులు తెలిపారు.



రాణిపేట సిప్కాట్‌లో ఎస్‌ఓఎల్ ఎయిర్ సెపరేషన్ ప్లాంట్‌ను సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్



సహకార శాఖ అమలు చేస్తున్న పథకాలపై ప్రకటనలతో ఉన్న సిటీ బస్సులను పల్లవన్ హౌస్ వద్ద పచ్చజెండా ఊపి ప్రారంభిస్తున్న ఆ శాఖ మంత్రి కేఆర్ పెరియకరుప్పన్

మాధవరంలో జోరుగా పొట్టేళ్ల విక్రయాలు



పొట్టేళ్ల కొనుగోలు చేసేందుకు వచ్చిన వ్యాపారులు

ప్యారీస్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను ఈ నెల 7వ తేదీ జరుపుకోనున్నారు. బక్రీద్ సందర్భంగా ఇరుగు పొరుగు వారికి, పేదలకు తమవంతు దానంగా పొట్టేలు,ఒంటె మాంసాన్ని అందజేయడం ఆనవాయితీ. శనివారం బక్రీద్ జరుపుకోనున్న నేపథ్యంలో,రాష్ట్రవ్యాప్తంగా పొట్టేళ్ల విక్రయాలు జోరందుకున్నాయి.మాధవరం సంతకు వివిధ ప్రాంతాల నుండి వేలసంఖ్యలో తరలించిన పొట్టేళ్లను కొనుగోలు చేసేందుకు మాంసం వ్యాపారులు పోటీపడుతున్నారు.10కిలోలకుపైగా బరువున్న పొట్టేలు రూ.12వేలకు, అంతకంటే ఎక్కువ బరువైన పొట్టేలు రూ.50వేలకు విక్రయించడంపై వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పరందూరు విమానాశ్రయ పనులను ప్రారంభించండి

- సమీక్షా సమావేశంలో సీఎం ఆదేశం



పరందూరు విమానాశ్రయ నిర్మాణ పనులపై మంత్రులు, అధికారులతో సచివాలయంలో సమీక్ష జరుపుతున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పరందూరు విమానాశ్రయ నిర్మాణ పనులను వేగంగా ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధికారులకు ఆదేశాలిచ్చారు. పరందూరులో ఏర్పాటు కానున్న రెండో హరిత విమానాశ్రయం నిర్మాణ పనులు ఏవిధంగా జరగాలనే అంశంపై మంత్రులు, అధికారులతో బుధవారం ఉదయం సచివాలయంలో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. కాంచీపురం జిల్లా పరందూరులో 5300 ఎకరాల్లో నిర్మించనున్న ఈ విమానాశ్రయం కోసం ప్రస్తుతం పరందూరు, ఏకనాపురం సహా 13 గ్రామాల్లో స్థల సేకరణ త్వరలో ప్రారంభం కానుంది. స్థల సేకరణకు సంబంధించి ప్రసారమాధ్యమాల్లో ప్రకటనలు కూడా ఇచ్చారు. ఓ వైపు విమానాశ్రయ ఏర్పాటును వ్యతిరేకిస్తూ పరందూరు, ఏకనాపురం సహా 13 గ్రామాల ప్రజలు నిర్విరామంగా ఆందోళనలు జరుపుతుండగా, మరో వైపు స్థల సేకరణ పనులు చురుకుగా సాగుతున్నాయి. ఈ నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వ సంస్థ టిడ్కో చేపట్టనుంది. ఈ విషయమై ప్రాజెక్టు అనుమతి మంజూరు చేయాలని పౌరవిమానయాన సంస్థను కూడా కోరింది. గత ఏప్రిల్‌లో ఆ సంస్థ ప్రాజెక్టు అనుమతి కూడా మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో సచివాలయంలో జరిగిన సమావేశంలో పరందూరు విమానాశ్రయ నిర్మాణ పనులను నాలుగు విడతలుగా 2026న ప్రారంభించి 2028లోగా పూర్తిచేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో మంత్రులు తంగం తెన్నరసు, ఆర్‌ఎస్ రాజకన్నప్పన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్. మురుగానందం, పర్యావరణ, అటవీ శాఖల అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సుప్రియా సాహూ, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి. ఉదయచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

దేశ కీర్తి ప్రతిష్ఠలను చాటిన కనిమొళి

- సీఎం స్టాలిన్ ప్రశంస

చెన్నై, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదుల మారణకాండ నేపథ్యంలో 'ఆపరేషన్ సిందూర్' పేరుతో భారతసైన్యం దాడులు చేయడంలో ఉన్న న్యాయాన్ని ప్రపంచ దేశాలకు వివరించేందుకు ఏర్పాటైన కమిటీలో డీఎంకే ఎంపీ కనిమొళి చూపిన చొరవ ప్రశంసనీయమని ఆమె సోదరుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రశంసించారు. బుధవారం ఉదయం క్యాంపు కార్యాలయంలో సీఎంను కనిమొళి కలుసుకుని రష్యా, స్పెయిన్ తదితర దేశాల పర్యటనలో శాంతిని కోరుకునే భారతదేశంలో హింసకు, ఉగ్రవాదానికి తావులేదని తాను స్పష్టంగా ప్రకటించానని వెల్లడించారు. స్టాలిన్ ఆ సందర్భంగా మాట్లాడుతూ స్పెయిన్‌లో జరిగిన మీడియా సమావేశంలో భారతదేశపు జాతీయ భాష ఏదని ఓ విలేఖరి ప్రశ్నించినపుడు 'భిన్నత్వంలో ఏకత్వమే భారతీయ జాతీయ భాష' అని ప్రకటించడం హర్షణీయమన్నారు. కనిమొళి చేసిన ఆ ప్రకటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో తీవ్రంగా వైరల్ అవుతోందని కూడా స్టాలిన్ తన సోదరిని మెచ్చుకున్నారు.



క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌తో భేటీ అయిన ఎంపీ కనిమొళి





శ్రీవారిసేవలో ప్రముఖులు


తిరుమల, జూన్4(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హిరణ్మయ్ భట్టాచార్య వేకువజాము సుప్రభాత సేవలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో రిలయన్స్ సీఈవో పీఎంఎస్ ప్రసాద్, ఎమ్మెల్యే గుమ్మానూరు జయరాం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఆర్టీసీ బస్ డ్రైవర్‌పై కానిస్టేబుల్ దాడి!



తిరుమల, జూన్4(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఎలక్ట్రికల్ డ్రైవర్‌పై ఓ కానిస్టేబుల్ దాడి చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వివరాలివి.. తిరుమలలోని మాధవనిలయం ముందు మంగళవారం రాత్రి 7.30 గంటలకు ప్రయాణికులను ఎక్కించుకునే క్రమంలో ఎలక్ట్రిక్ బస్సు డ్రైవర్ ఆపాడు. ట్రాఫిక్‌కి అంతరాయం కలిగిస్తున్నాడని వెనుకే ద్విచక్రవాహనంపై వస్తున్న కానిస్టేబుల్ ఆగ్రహంతో బస్సు ఎక్కి డ్రైవర్‌పై దాడి చేశాడు. బస్సులోని సీసీ కెమెరాల్లో ఈ దృశ్యాలు రికార్డు అయ్యాయి. ప్రస్తుతం ఆ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. తమకు ఫిర్యాదు రాలేదని, డ్రైవర్ నుంచి ఫిర్యాదు వస్తే కేసు నమోదు చేస్తామని టూటౌన్ పోలీసులు తెలిపారు.

సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.4.29 కోట్లు

మంగళవారం దర్శించుకున్న భక్తుల సంఖ్య 78,631

తలనీలాలు సమర్పించినవారు: 31,247



ముప్పును మోసుకొస్తున్న సంచులు

- ప్లాస్టిక్ వ్యర్థాలతో మనుగడకు పెనుసవాలు
- నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

జీవరాశుల మనుగడలో పర్యావరణ పాత్ర కీలకం. ఆధునిక పరిస్థితుల నేపథ్యంలో రకరకాల కారణాలతో రాన్రానూ పర్యావరణ సమతుల్యం దెబ్బతింటోంది. మానవ మనుగడకు సవాలు విసురుతోంది. కాలుష్య కోరల్లోకి చేర్చుతూ ప్రమాదంలోకి నెట్టెస్తోంది. ప్రజలు, ప్రభుత్వాలు మేల్కొని బాధ్యతగా స్పందించకపోతే భావితరాల జీవనానికి పెనుముప్పు కాగలదని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

- తిరుపతి రూరల్ (ఆంధ్రజ్యోతి)

ప్లాస్టిక్ వ్యర్థాలతో ముప్పు

ప్లాస్టిక్.. ఈతరం ప్రజల జీవితంతో విడదీయరానంతంగా పెనవేసుకుపోయింది. ఉదయం పాలప్యాకెట్లతో మొదలై ప్రతి చిన్న వస్తువుకూ కవరుగా మారిపోయింది. నగరంలో ఈ ఈ ప్రభావం మరింత ఎక్కువగా ఉంది. ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగం పెరిగి పర్యావరణానికి, ఆరోగ్యానికి పెనుముప్పుగా తయారైంది. ప్రమాదకర వ్యాధులకు కారణమవుతోంది. పలుచగా తక్కువ బరువు ఉండటంతో యూజ్ అండ్ త్రో కవర్లను విరివిగా వాడుతున్నారు. అవసరం తీరాక ఈ సింగిల్‌యూజ్ పాలిథిన్ వ్యర్థాలను డ్రైనేజీ కాలువలు, చెత్తకుప్పలు, రోడ్డుపక్కన పడేస్తున్నారు. ఇవి భూమిలో కలిసేందుకు వేల సంవత్సరాలు పడుతుందని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. ఆవులు, గేదెలు, మేకలు, కుక్కలు లాంటివి తెలియకుండా ఆహారంగా తీసుకుని అనారోగ్యం పాలవుతున్నాయి. నిర్దేశిత ప్రమాణాలను అతిక్రమిస్తూ టీ షాపుల్లో వాడుతున్న కప్పులు, పార్శిల్ కోసం వినియోగిస్తున్న ప్లాస్టిక్ వస్తువులు క్యాన్సర్ లాంటి ప్రమాదకర వ్యాధులకు కారణమవుతున్నాయి.

నిషేధం అమలు అంతంతమాత్రమే..

తిరుపతి నగరంలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించినా అమలు నామమాత్రంగానే ఉంది. అధికారులు చిత్తశుద్ధితో ఉద్యమంలా ప్రజల్లో అవగాహన కల్పిస్తే నిషేధానికి ముకుతాడు వేయడం కష్టమేంకాదు. అమ్ముతున్న వారిపై కేసులు పెట్టి చేతులు దులుపుకొనే కన్నా వాటి ఉత్పత్తి మూలాలను గుర్తించి కట్టడి చేయాలని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు. కొన్ని సంస్థలు ఇప్పటికే తమ ఉత్పత్తుల ప్యాకింగుకు గుడ్డ సంచులు ఇస్తున్నాయి. ఈ సంస్కృతి అన్నిటా వ్యాపించేల చూడాలి. తిరుమలలో ప్లాస్టిక్ వాటర్‌బాటిళ్ల విక్రయాల నిషేధం మాత్రం పక్కాగా అమలవుతోంది. గాజుసీసాలను వినియోగిస్తున్నారు.



పెరుగుతున్న వాయుకాలుష్యం

తిరుమల నేపథ్యంలో భారీ సంఖ్యలో రోజూ వచ్చే వాహనాలతో పొగ కాలుష్యం పెరిగిపోతోంది. గాలిలోని పర్టిక్యులేట్‌మేటర్స్(పీఎం) కారకాలుగా పనిచేస్తున్నాయి. మూడేళ్లకు ముందు తిరుపతిలో పీఎం 2.5లెవల్స్ 22మైక్రోగ్రామ్/మీటర్‌క్యూబ్ ఉండగా..ఇటీవల 32 మైక్రోగ్రామ్/మీటర్‌క్యూబ్‌గా నమోదైనట్లు సమాచారం. పీఎం10లెవల్స్‌మూడేళ్లకు ముందు 53మైక్రోగ్రామ్/మీటర్‌క్యూబ్‌గా ఉండగా ఇప్పుడు 74మైక్రోగ్రామ్/మీటర్‌క్యూబ్‌కి చేరుకున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.. డబ్ల్యూహెచ్‌వో సిఫార్సుల మేరకు పీఎం 2.5లెవల్స్‌లో 15 మైక్రోగ్రామ్/మీటర్‌క్యూబ్‌గా, పీఎం10లెవల్స్‌లో 45 మైక్రోగ్రామ్/మీటర్‌క్యూబ్ ఉండాలి. ఈ పెరుగుదల క్రమంలోనే అనారోగ్యసమస్యలు తలెత్తుతున్నాయి. తిరుపతి పరిసరాల్లో పారిశ్రామికాభివృద్ధి, అమాంతం పెరిగిన డీజిల్ వాహనాలు, వ్యర్థాల కాల్చివేత లాంటి వాటివల్ల కూడా గాలి కాలుష్యమవుతోంది. ఇది పర్యావరణానికి చేటు కలిగిస్తూ అనారోగ్యసమస్యలకు కారణమవుతోంది.

తూకివాకం వద్ద ప్లాంట్

నగరంలో రోజుకు సగటున రెండు టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పత్తవుతున్నాయి. వీటిలో పునర్వినియోగపరచదగినవి(రీసైకిల్), పునర్వినియోగపరచలేని(నాన్ రీసైకిల్) వేరు చేసేందుకు తూకివాకం వద్ద పీపీపీ విధానంలో(సెంట్రలైజ్డ్ యూనిట్)ఘనవ్యర్థాల నిర్వహణ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఇది రోజుకు ఐదు టన్నుల ప్లాస్టిక్‌ని ప్రాసెసింగ్ చేసే సామర్థ్యాన్ని కలిగిఉంది. తక్కువ గ్రేడ్ ప్లాస్టిక్‌ని కూడా ఇక్కడప్రాసెస్ చేస్తున్నారు. రీయూజ్‌బుల్ కానివాటిని జిందాల్‌గ్రూప్ సంస్థతో ఒప్పందం చేసుకుని ప్రాసెస్ చేస్తున్నారని తెలిసింది.



అవగాహన పెంచాలి



ప్లాస్టిక్ వ్యర్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన పెంచాలి. తరచూ సదస్సులు నిర్వహించాలి. కర్బన ఉద్గారాలు తగ్గించేందుకు విరివిగా మొక్కలు నాటాలి. సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలి. ప్రత్యామ్నాయ వినియోగాలవైపు ప్రజల దృష్టి మరల్చాలి. చిత్తశుద్ధితో పర్యవేక్షణ అవసరం. సింగిల్ యూజ్ కవర్ల ఉత్పత్తిని ఆపగలిగితే ఉత్తమం. ఎకోఫ్రెండ్లీని పెంచాలి.

- ప్రొఫెసర్ డాక్టర్ తేటి దామోదరం, పర్యావరణ శాస్త్రవిభాగ హెడ్, ఎస్వీయూ

తడి, పొడిచెత్త వేరుచేసి ఇవ్వాలి



తిరుపతి నగరంలో తడి, పొడిచెత్తలను వేరుచేయకుండా ఇస్తున్నారు. దీని నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలను వేరుచేయడం కష్టంగా ఉంటోంది. ఇంటివద్దే వేరుచేసి ఇవ్వాలి. ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలను పడేయడాన్ని మానుకోవాలి. ఇది అనారోగ్య సమస్యలను తెచ్చిపెడుతుంది. చెత్తను కాల్చినపుడు వచ్చే పొగతో కాలుష్యంతోపాటు అనారోగ్యసమస్యలు తలెత్తుతాయి.

-ఎన్.మౌర్య, నగరపాలకసంస్థ కమిషనర్

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

పెళ్లకూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిరసనమాల చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహాన్ని ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యం లో బుధవారం అగ్నిమాపక, పోలీస్ సిబ్బంది వెలికి తీశారు. మంగళవారం సాయంత్రం దిరసనమాల గ్రామానికి చెందిన శ్రీనివాసులు(55), తన భార్య మాధవితో కలసి తప్పిపోయిన ఆవు, దూడలను వెతికేందుకు చెరువు వద్దకు వెళ్లారు. ఆవు ఒడ్డుకు చేరుకోగా దూడ చెరువు నీళ్లలో చిక్కుకుపోయింది. దూడను కాపాడానికి చెరువులోకి దిగిన శ్రీనివాసులు నీళ్లలోనే మునిగిపోయాడు. తన కళ్లముందే మునిగిపోతున్న భర్తను కాపాడ్డానికి మాధవి కేకలు వేసింది. గ్రామస్తులు గాలించినా శ్రీనివాసులు ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ నాగరాజు, వీఆర్వో భూదనం రమేష్, పంచాయతీ కార్యదర్శి సమ్మన ప్రభాకర్, అగ్నిమాపక అధికారులు చెరువు వద్దకు చేరుకున్నారు. అప్పటికే చీకటి పడడంతో గాలింపు చర్యలకు అంతరాయం ఏర్పడింది. దీంతో బుధవారం తిరిగి గాలింపు చర్యలు కొనసాగించారు. ఉదయాన్నే శ్రీనివాసులు మృతదేహం చెరువు నీటిపై తేలియాడడంతో వెలికితీసి నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఆస్పత్రి వద్దకు చేరుకుని మృతుని కుటుంబసభ్యులను ఓదార్చారు. పంచనామ అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక తవ్వకాలను అడ్డుకున్న రైతులు



హిటాచిని అడ్డుకున్న గ్రామస్తులు

పెళ్లకూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖినదిలో జరుగుతున్న ఇసుక తవ్వకాలను దిగువ కలవకూరు సమీపంలో రైతులు అడ్డుకున్నారు. మండలంలోని ఎగువ కలవకూరు, పుల్లూరు గ్రామాల సమీపంలోని స్వర్ణముఖినదిలో పూడికతీత అవసరమని భావించి కూలీలతో ఇసుకను తరలించేందుకు అధికారులు అనుమతులు ఇచ్చారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా భారీ యంత్రాలతో ఇసుకను ఇష్టానుసారంగా తవ్వి తరలిస్తుండంతో చింతపూడి గ్రామానికి చెందిన రైతులు అడ్డుకున్నారు. దీంతో వాహనదారులకు, రైతులకు నడుమ కాసేపు వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో గ్రామస్తులు ధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పుల్లూరు, కలవకూరు, చింతపూడి పరిధిలోని స్వర్ణముఖినదిలో తాగు, సాగునీటి బోరుబావులు ఉన్నాయన్నారు. అలాంటి ప్రాంతంలో పూడికతీత పేరుతో అనుమతులు ఇవ్వడం సరికాదన్నారు. ఇసుక తరలిస్తే బావులు ఎండిపోయి పంటల సాగు కష్టమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పూడికతీత పేరుతో ఇచ్చిన అనుమతులను రద్దుచేయాలని కోరారు.

ఉగ్రవాదులపై నిరంతర అప్రమత్తత అవసరం

- భద్రతా దళాలు, టీటీడీ సిబ్బందితో ఏఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ రామకృష్ణ

తిరుమల, జూన్4(ఆంధ్రజ్యోతి): తిరుమల క్షేత్రంలో అలజడి సృష్టించేందుకు ఏరూపంలో ఉగ్రవాదులొచ్చినా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు భద్రతాదళాలతో పాటు అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఏఎస్పీ రామకృష్ణ అన్నారు. తిరుమల ఆస్థానమండపంలో టీటీడీ విజిలెన్స్, సివిల్ పోలీసు, ఏఆర్, ఏపీఎస్పీ, ఎస్పీఎఫ్, ఫైర్‌తో పాటు టీటీడీ అధికారులు, సిబ్బంది, అర్చకులు, పోటు కార్మికులు, ట్యాక్సీ డ్రైవర్లు, మఠాల నిర్వాహకులతో ఆయన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. ఉగ్రవాదులు మనలోనే కలిసిపోయి హింస సృష్టించేందుకు ప్రణాళికలు రూపొందిస్తుంటారన్నారు. కూలీల ముసుగులోనూ వచ్చే అవకాశాలుంటాయన్నారు. కొన్ని సందర్భాల్లో మనం గుర్తించే చిన్నచిన్న విషయాలే పెద్ద విపత్తుల నుంచి రక్షించేందుకు ఉపయోగపడతాయన్నారు. సూరత్‌లో ఉగ్రవాదులు అమర్చిన బాంబులను స్థానికులే గుర్తించడంతో దాదాపు 29 బాంబుల నుంచి ప్రజలు ప్రాణాలతో బయటపడ్డారని సోదాహరించారు. ఇదే తరహాలో దేశంలోని పలు ఆలయాల్లో జరిగిన ఉగ్రదాడులు, అక్కడ జరిగిన నష్టం, ఎలా బ్లాస్టులు చేశారు వంటి వివిధ అంశాలను స్క్రీన్‌పై ప్రదర్శించారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే ఎలా స్పందించాలి, తక్షణం చేపట్టాల్సిన చర్యల గురించి వివరించారు.

సింహ వాహనంపై అనంత తేజోమూర్తి





తిరుపతి అర్బన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): నగరంలో గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం మాడ వీధుల్లో సింహ, రాత్రి ముత్యపు పందిరి వాహనాల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. వాహనం ముందు గజరాజులు, గోవులు ఠీవీగా నడుస్తుండగా కళాబృందాలు కోలాటాలు, వివిధ వేషధారణలు ఆకట్టుకున్నాయి.మంగళవాయిద్యాల నడుమ ఈ ఉత్సవం కోలాహలంగా సాగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం కన్నుల పండువగా నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించారు. ఉత్సవాల్లో జియ్యంగార్లు, టీటీడీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జేమ్స్‌పై దాడి కేసులో మరో ఆరుగురి అరెస్టు

తిరుపతి(కలెక్టరేట్),జూన్4(ఆంధ్రజ్యోతి): రంగంపేటలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న జేమ్స్‌పై గతనెల 14న జరిగిన దాడిలో 18మందిపై కిడ్నాప్, హత్యాయత్నం, అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి. రెండు రోజుల క్రితం ప్రధాన నిందితుడు యశ్వంత్‌తో పాటు 12మందిని తిరుచానూరు పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపించారు. బుధవారం ఈ కేసులో ప్రమేయమున్న చోటా బ్లేడ్, దీపక్‌కుమార్, జగదీష్, సాయి హరితేజ, రూపేష్, సోమశేఖర్‌లను పాడిపేట శేషాద్రినగర్ వద్ద అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సునీల్‌కుమార్, ఎస్ఐ సాయినాథ్ చౌదరి తెలిపారు.రూపేష్‌పై రౌడీషీట్, చోటా బ్లేడ్, జగదీష్‌లపై క్రిమినల్ కేసులు ఉన్నాయని వివరించారు. కాగా, అరెస్టు అయిన ఆరుగురూ వైసీపీకి చెందిన మాజీ మంత్రి, తిరుపతి మాజీ డిప్యూటీ మేయర్ అనుచరులే కావడం గమనార్హం.

ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్‌గా చరణ్

తిరుపతి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ తిరుపతి జోన్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా రుద్రరాజు చరణ్ నియమితులు కానున్నారు. ప్రస్తుతం స్టేట్ ఆడిట్ శాఖలో స్పెషల్ క్యాడర్ అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా తిరుపతిలో పనిచేస్తున్న చరణ్‌ను ప్రభుత్వం బుధవారం పరిశ్రమల శాఖకు డెప్యుటేషన్‌పై బదిలీ చేసింది. ఆ శాఖలో ఆయన ఏపీఐఐసీ తిరుపతి జోన్‌కు డిప్యూటీ జోనల్ మేనేజర్ (అసెట్ మేనేజ్‌మెంట్) పోస్టులో నియమితులు కానున్నారు. డెప్యుటేషన్‌పై ప్రాథమికంగా ఆయన సంబంధిత పోస్టులో ఏడాది పాటు కొనసాగనున్నారు. పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.యువరాజ్ బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

యూనివర్సిటీల్లో అభివృద్ధి ఇలా..!

- వర్సిటీ అధికారుల సమావేశంలో ఎస్వీయూ, పద్మావతి అధికారుల నివేదన



సమావేశంలో పాల్గొన్న ఎస్వీయూ, పద్మావతి వర్సిటీ అధికారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ, పద్మావతి యూనివర్సిటీలను ఈ విధంగా అభివృద్ధి చేస్తున్నామంటూ ఆయా యూనివర్సిటీల అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. విజయవాడలో ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తి, ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ బుధవారం నిర్వహించిన యూనివర్సిటీ అధికారుల సమావేశంలో ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, పద్మావతి వర్సిటీ వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని పాల్గొన్నారు. ఇటీవల యూనివర్సిటీల్లోని పరిణామాలు, కొత్త కార్యక్రమాలు, కొత్త లక్ష్యాలను వారు రాష్ట్ర ఉన్నత విద్యామండలికి వివరించారు. బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో అభివృద్ధిని ప్రామాణికంగా, వేగవంతంగా చేపట్టడం ద్వారా ప్రపంచ స్థాయి ర్యాంకులను యూనివర్సిటీలు సొంతం చేసుకోవాలని ఉన్నత విద్యామండలి అధికారులు సూచించారు.

వేద వర్సిటీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

- దరఖాస్తుకు ఈనెల 10 చివరి గడువు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు),జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వేద విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న పలు కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చు.సమగ్ర సమాచారం కోసం.. వేదిక్ యూనివర్సిటీ.. పేర గల వెబ్‌సైట్ చూడాలని ఆ వర్సిటీ పీఆర్వో డాక్టర్ బ్రహ్మాచార్యులు కోరారు.

10న నాయుడుపేటలో మెగా జాబ్‌మేళా



జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నాయుడుపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 10వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని, శ్రీసిటీ, మేనకూరు సెజ్, ఈఎంసీ క్లస్టర్, తిరుపతి, చెన్నైలోని 17 బహుళజాతి కంపెనీల్లో 900కు పైగా ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. 5వ తరగతి పైన, పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణులైన యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంబంధిత లింక్‌లో ఈనెల 9వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9985056929, 9154449677లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి గణేష్ పాల్గొన్నారు.